# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 58 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 1 నవంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :58 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 1 NOVEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది..
# రాప్తాడు ఘటనే నిదర్శనం

- రాప్తాడు పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై కిరాతక దాడి
- టీడీపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయన్న మాజీ సీఎం జగన్
- ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్ర్భాంతి, నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని హామీ
- బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం
- ఘటనపై విస్తృత దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు

- మిగతా 2లో



# ఆ 53 రోజుల అక్రమ నిర్బంధంపై
# కోట్లాది ప్రజల స్పందనను ఎప్పటికీ మరువను

- రాజమండ్రి జైలు నుంచి విడుదలై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పోస్ట్
- నాటి మద్దతు జీవితంలో మర్చిపోలేనని చంద్రబాబు భావోద్వేగం
- ప్రజల సహకారంతో 2047 నాటికి తెలుగు జాతిని నెం.1 చేస్తానని ప్రతిజ్ఞ

పెన్ పవర్ డెస్క్:గత ప్రభుత్వ హయాంలో తాను 53 రోజుల అక్రమ నిర్బంధాన్ని ఎదుర్కొన్నానని, ఆ సమయంలో తనకు అండగా నిలిచిన కోట్లాది ప్రజల మద్దతును జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని

- మిగతా 2లో






## ఏపీ మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం..
# నేడు పోలింగ్!

- ఆంధ్రప్రదేశ్‌లో పుర, నగర పాలక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- 36,351 మంది పోలీసులతో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బందోబస్తు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు లేదా వెబ్‌కాస్టింగ్
- దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు
- ఓటర్లు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఈసీ పిలుపు

## ప్రతి పోలింగ్ కేంద్రంపై కెమెరా నీడ!

ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ పునేఠా వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కెమెరాల నిఘా పరిధిలోకి తీసుకొచ్చామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశంలో పూర్తి వివరాలు అందించారు.

**36 వేల మంది పోలీసులతో పటిష్ఠ భద్రత**

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా స్థానిక ఎన్నికల కోసం 36,351 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్‌గా వర్గీకరించారు. హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో 1+4 (ఒక అధికారి, నలుగురు సిబ్బంది), సెన్సిటివ్ కేంద్రాల్లో 1o3 పద్ధతిలో భద్రత కల్పిస్తున్నారు.

- మిగతా 2లో

# స్కూల్‌లో దారుణం..
## పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో పాశవిక దాడి!

- రాప్తాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఘటన
- పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి
- బాలిక ముఖం, తల, వీపుపై తీవ్ర గాయాలు
- అడ్డుకునేందుకు వెళ్లిన మరో విద్యార్థినికి గాయాలు
- బాలికను ఆసుపత్రికి తరలించి చికిత్స



అనంతపురం జిల్లాలోని రాప్తాడు మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ వ్యక్తి చెట్లను కోసే ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో చాలా తీవ్రమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు.పాఠశాలలోకి వచ్చిన నిందితుడు విద్యార్థినిపై ఒక్కసారిగా దాడికి పాల్పడినట్లు సమాచారం.

- మిగతా 2లో

## చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో
# చూశాక కన్నీళ్లు ఆగడం లేదు

- రాప్తాడులో బాలికపై దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి లోకేశ్
- ఆడపిల్లల భద్రతకు భంగం కలిగిస్తే ఉక్కుపాదంతో అణిచేస్తామని హెచ్చరిక
- పాఠశాల తరగతి గదిలో విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన ఉన్మాది
- ధర్మవరం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- మిగతా 2లో

- ఘటనపై సీఎం చంద్రబాబు, మంత్రులు దిగ్ర్భాంతి, కఠిన చర్యలకు ఆదేశాలు





## ఏపీకి మరో తుపాను గండం..
### నెల్లూరు-నరసాపురం మధ్య తీరం దాటనున్న తీవ్ర తుపాను!

- బంగాళాఖాతంలో బలపడుతున్న వాయుగుండం
- నవంబర్ 2 నాటికి తీవ్ర తుపానుగా మారే సూచన
- నెల్లూరు - నరసాపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందన్న ఐఎండీ
- గంటకు 120 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా

పెన్ పవర్ డెస్క్:ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వేగంగా బలపడుతోంది. ఇది రేపటికి తుపానుగా, ఆపై తీవ్ర తుపానుగా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకురానుంది. ఈ తుపాను నవంబర్ 3వ తేదీ ఉదయం నెల్లూరు,

- మిగతా 2లో

## ఖైబర్ పఖ్తుంఖ్వాపై పాక్ సైన్యం కన్ను..
# ఖనిజ సంపదే లక్ష్యమా?

- పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతంపై ఆందోళన 2లో
- ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎమర్జెన్సీ విధింపు
- ప్రావిన్స్ ఖనిజ సంపదను చేజిక్కించుకునేందుకే ఈ చర్యలని అనుమానాలు
- ఈ చర్యలతో తీవ్రవాదానికి ఆయుధం ఇచ్చినట్లవుతుందని హెచ్చరించిన నివేదిక





## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం..
### ఫ్యాక్టరీలో నలుగురు సజీవ దహనం

- ఢిల్లీలోని మంగోల్పురిలో ఘటన
- చెప్పుల ఫ్యాక్టరీలో చెలరేగిన మంటల్లో నలుగురు మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఆరుగురిని కాపాడిన సిబ్బంది
- రబ్బరు కారణంగా మంటలు వేగంగా వ్యాపించాయని అంచనా
- ప్రమాద కారణాలపై పోలీసుల దర్యాప్తు ప్రారంభం


- మిగతా 2లో

## దేశ యువత మిమ్మల్ని
# క్షమించదు

పెన్ పవర్ డెస్క్: ఓట్లను కొల్లగొట్టేందుకు కుట్రపన్నే వారిని లక్ష్యంగా చేసుకొని ప్రజా అభిశంసన కార్యక్రమం చేపట్టామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఉ పేర్కొన్నారు. ఎన్నికల ప్రధాన అధికారిపై కేసు పెట్టి న్యాయస్థానంలో విచారణ జరపాలన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పెట్టిన అభిశంసన తీర్మానానికి మద్దతు పలికిన ఆయన.. విపక్ష నేతలంతా పచ్చిక బయళ్లలో

- మిగతా 2లో





## దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు..
### వారి కుట్రలను భగ్నం చేయాలి

పెన్ పవర్ డెస్క్: దేశాభివృద్ధి దిశగా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని, ఈ ప్రయాణాన్ని అడ్డుకోవాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ పురోగతికి ఆటంకాలు సృష్టించే ప్రయత్నాలను ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 31న గుజరాత్‌లోని

- మిగతా 2లో

## రెస్క్యూ మిషన్ విఫలం..
### భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్

పెన్ పవర్ డెస్క్: దాదాపు 22 ఏళ్లుగా అంతరిక్షంలో సేవలందిస్తున్న నాసాకు చెందిన 'స్విఫ్ట్ అబ్జర్వేటరీ' అనే భారీ టెలిస్కోప్ త్వరలో భూమిపై కూలిపోనుంది. ఈ టెలిస్కోప్ రెస్క్యూ కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో.. అది అంతకంతకూ కిందికి దిగుతూ..

- మిగతా 2లో






# ఆ 53 రోజుల అక్రమ నిర్బంధంపై

## కోట్లాది ప్రజల స్పందనను ఎప్పటికీ మరువను

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్వేగభరితంగా పేర్కొన్నారు. సరిగ్గా మూడేళ్ల క్రితం ఇదే రోజున (అక్టోబర్ 31) రాజమండ్రి జైలు నుంచి విడుదలైన సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన శనివారం ఒక సుదీర్ఘమైన, భావోద్వేగభరితమైన సందేశాన్ని పంచుకున్నారు. తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆ 53 రోజులే అత్యంత కఠినమైనవని ఆయన అభివర్ణించారు.

**అర్ధరాత్రి అరెస్టు ఒక కుట్ర**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకుంటూ, "నాడు విధ్వంస పాలనను ప్రశ్నిస్తుంటే సహించలేని పాలకులు, ప్రజలను, ప్రతిపక్షాలను అణచివేయాలని చూశారు. అందులో భాగంగానే నంద్యాలలో కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను అర్ధరాత్రి అన్యాయంగా అరెస్టు చేశారు. అది కుట్రపూరిత అరెస్టు, అక్రమ నిర్బంధం అని అందరికీ తెలుసు" అని చంద్రబాబు ఆరోపించారు. నిర్బంధంతో తనను ఒంటరిని చేయాలనుకున్న కుట్రలు, యావత్ తెలుగు జాతి తిరుగుబాటుతో బద్దలయ్యాయని ఆయన అన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో మళ్లీ ప్రజల్లోకి వచ్చానని తెలిపారు.

**ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన మద్దతు**

తాను జైల్లో ఉన్నప్పుడు రాష్ట్రం, దేశం అనే తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా 60కి పైగా దేశాల్లోని తెలుగువారు, ప్రజాస్వామ్యవాదులు స్వచ్ఛందంగా తనకు సంఘీభావం తెలిపారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. "పల్లెల్లో సామాన్య మహిళల నుంచి ప్రపంచస్థాయి కార్పొరేట్ కంపెనీల సీఈవోల వరకు, రైతుల నుంచి సాఫ్ట్‌వేర్ నిపుణుల వరకు, విద్యార్థుల నుంచి ప్రవాసాంధ్రుల వరకు.. సమాజంలోని ప్రతి వర్గం నుంచి వెల్లువెత్తిన మద్దతు అపూర్వం" అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా, ఎంత నిర్బంధం ఉన్నా గచ్చిబౌలి స్టేడియంలో 'సీబీఎన్ గ్రాటిట్యూడ్' పేరుతో జరిగిన కార్యక్రమంలో వేలాదిగా తరలివచ్చిన యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ తన కోసం నినదించిన ఘటన జీవితాంతం గుర్తుండిపోతుందని అన్నారు.

**కుటుంబ సభ్యులకు, ప్రజలకు కృతజ్ఞతలు**

రాజకీయాలకు ఎప్పుడూ దూరంగా ఉండే తన అర్ధాంగి, కుటుంబ సభ్యులు సైతం 'నిజం గెలవాలి' అంటూ ప్రజల వద్దకు వస్తే, వారితో కలిసి ప్రజలు అడుగు వేసి నిజాన్ని గెలిపించారని చంద్రబాబు అన్నారు. ఆ కష్టకాలంలో తనకు మద్దతు పలికిన ప్రతి పౌరుడికి, కార్యకర్తకు, అభిమానికి, ప్రజాస్వామ్యవాదికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. "నాడు నా కష్టాన్ని తమ కష్టంగా భావించి స్పందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మీ ప్రేమను, అభిమానాన్ని, నమ్మకాన్ని నా జీవితాంతం నిలబెట్టుకుంటాను. నా కోసం నిలిచిన మీ కోసం చివరి వరకు నిలబడతాను" అని ఆయన హామీ ఇచ్చారు.

**మీ భవిష్యత్తే నా సంకల్పం**

ప్రజల నమ్మకం, అభిమానమే తన బలమని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వారి భవిష్యత్తే తన సంకల్పమని స్పష్టం చేశారు. ప్రజలందరి మద్దతు, సహకారం, భాగస్వామ్యంతో 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ 1 స్థానంలో నిలబెడతానని ప్రతిజ్ఞ చేశారు.

# ఏపీకి మరో తుపాను గండం..

- మొదటి పేజి తరువాయి

నరసాపురం మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగాన్ని కూడా తాకొచ్చని హెచ్చరించింది.ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్ నికోబార్ దీవులకు సమీపంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వాయుగుండం, గత 6 గంటల్లో గంటకు 30 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఈ (అక్టోబర్ 31) అర్ధరాత్రికి ఇది తీవ్ర వాయుగుండంగా, రేపటికి (నవంబర్ 1న) తుపానుగా, నవంబర్ 2 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.శనివారం సాయంత్రం 5:30 గంటల సమయానికి ఈ వాయుగుండం చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 960 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి ఆగ్నేయంగా 980 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 1,030 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. నవంబర్ 3వ తేదీ తెల్లవారుజామున ఇది దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంగా చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తుపాను హెచ్చరికల నేపథ్యంలో దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. సముద్రం అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేయనున్నారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు.. వారి కుట్రలను భగ్నం చేయాలి

- మొదటి పేజి తరువాయి

ఏక్తా నగర్‌లో నిర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకల్లో ఆయన ప్రసంగించారు.

**ప్రతిపక్షాల తీరుపై విమర్శలు**

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల బాధ్యత ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, వాటిపై నిర్మాణాత్మకంగా విమర్శలు చేయడమేనని మోదీ పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ప్రతిపక్షాలు తమ బాధ్యతను పక్కనపెట్టి దేశాభివృద్ధికి అడ్డంకులు సృష్టించే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దేశాన్ని విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి చర్యలను ప్రజలు గుర్తించి ఐక్యంగా ఎదుర్కోవాలని సూచించారు.

**సోషల్ మీడియాపై కీలక వ్యాఖ్యలు**

సోషల్ మీడియాను తప్పుడు ప్రచారానికి, పుకార్ల వ్యాప్తికి ఆయుధంగా ఉపయోగిస్తున్నారని ప్రధాని ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాస్తవాలను తెలుసుకున్న తర్వాతే స్పందించాలని పిలుపునిచ్చారు.

**అభివృద్ధి లక్ష్యంగా భారత్ ప్రయాణం**

దేశం కీలక నిర్ణయాలు తీసుకుని పెద్ద లక్ష్యాల వైపు అడుగులు వేస్తున్నప్పుడు అనేక అడ్డంకులు ఎదురవుతాయని మోదీ అన్నారు. అయినప్పటికీ భారత్ తన ప్రయాణాన్ని ఆపబోదని స్పష్టం చేశారు. దేశ సరిహద్దుల భద్రత, అక్రమ చొరబాట్ల నియంత్రణ వంటి అంశాలపైనా ఆయన ప్రస్తావించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకుంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగడమే ప్రతి భారతీయుడి బాధ్యత అని ప్రధాని తన ప్రసంగంలో ఉద్ఘాటించారు.

# ఏపీ మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం.. నేడు పోలింగ్!

బ్యాలెట్ బాక్సుల తరలింపు, భద్రత కోసం 1,543 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించేందుకు డీఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను అందుబాటులో ఉంచారు. పల్నాడు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఏపీ స్పెషల్ పోలీస్‌కు చెందిన 130 ప్లటూన్లను మోహరించారు. డీజీపీ కార్యాలయం నుంచి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, క్విక్ రియాక్షన్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయని పునేతా వివరించారు.

**సుప్రీం ఆదేశాలతో సంపూర్ణ నిఘా**

ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇప్పటికే 6,600 పోలింగ్ లొకేషన్లలో 12,000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5,500 సమస్యాత్మక (సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్) కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కెమెరాలు లేని చోట్ల వీడియోగ్రఫీ, అది కూడా సాధ్యం కాని మారుమూల ప్రాంతాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట జరిగే ప్రతి కదలికను రికార్డు చేస్తామని అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాలు చివరి నిమిషంలో వచ్చినా, సాధ్యమైనంత వరకు అన్ని కేంద్రాలను నిఘా పరిధిలోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని పునేతా పేర్కొన్నారు.

**బరిలో 9,642 మంది అభ్యర్థులు.. 75 వేల సిబ్బంది**

రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 70 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కార్పొరేషన్ మేయర్/ఛైర్‌పర్సన్ పదవులకు 153 మంది, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులకు 367 మంది పోటీలో ఉన్నారు. కార్పొరేషన్లలోని 922 వార్డులకు 3,773 మంది, మున్సిపాలిటీల్లోని 2,382 వార్డులకు 6,669 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం మీద వార్డు పదవుల కోసం 9,642 మంది పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోలింగ్ సిబ్బంది ఇప్పటికే డిస్పాచ్ కేంద్రాల నుంచి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు.

ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం వివరాలను మీడియాకు వెల్లడిస్తామని ఎస్ఈసీ తెలిపింది.

**ప్రశాంత వాతావరణానికి సహకరించండి**

పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచాల్సిన అవసరం ఉందని ఎస్ఈసీ అనిల్ పునేతా అభిప్రాయపడ్డారు. ఓటర్లలో చైతన్యం పెంచేందుకు మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీలు (పిడుగురాళ్ల, గుడిజాల, దాచేపల్లి, దార్సి, పలమనేరు, ప్రొద్దుటూరు, రాయచోటి, కమలాపురం) ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎక్కువ కాలం అమల్లో ఉంటే అభివృద్ధి పనులు కుంటుపడతాయని, అందుకే ఈ ప్రక్రియను త్వరగా ముగించడం అందరికీ శ్రేయస్కరమని పునేతా పేర్కొన్నారు.

## చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో

# చూశాక కన్నీళ్లు ఆగడం లేదు

అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అమానుష దాడిపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, గుండె బరువెక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. "చిన్నారి చెల్లిని క్లాస్ రూములో నెత్తుటి మడుగులో చూశాక కన్నీళ్లు ఆగడం లేదు. ఉన్మాది ఘాతుకం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది," అని ఆయన అన్నారు. ఆడపిల్లలు, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని, ఉన్మాదులను ఉక్కుపాదంతో అణిచివేస్తామని లోకేశ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. మహిళల వైపు కన్నెత్తి చూడాలంటేనే భయపడే వాతావరణం సృష్టిస్తామని ఆయన స్పష్టం చేశారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించేవారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అసలేం జరిగిందంటే..**

రాప్తాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి నేరుగా పదో తరగతి గదిలోకి ప్రవేశించి, అక్కడ ఉన్న విద్యార్థినిపై చెట్ల కొమ్మలు నరికే రంపంతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినిపై కూడా దుండగుడు దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనతో పాఠశాలలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఉపాధ్యాయులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

**పోలీసుల అదుపులో నిందితుడు**

ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. ధర్మవరం వైపు పారిపోతుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ధర్మవరం మండలానికి చెందిన యువకుడిగా గుర్తించారు. బాధితురాలికి అతను దగ్గరి బంధువేనని స్థానికులు చెబుతున్నారు. వ్యక్తిగత కక్షల కారణంగానే ఈ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత అమానుషమైన చర్య అని పేర్కొన్నారు.

బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, ఆమె ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా ఈ ఘటనపై స్పందించి, బాలికకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం..

## ఫ్యాక్టరీలో నలుగురు సజీవ దహనం

దేశ రాజధాని ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంగోల్‌పురి ప్రాంతంలోని ఒక ఫ్యాక్టరీలో రాత్రి చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.వివరాల్లోకి వెళ్తే.. ఒక పాదరక్షల తయారీ పరిశ్రమ బేస్‌మెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది 20 ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఫ్యాక్టరీలో చిక్కుకున్న మరో ఆరుగురిని రెస్క్యూ టీమ్ సురక్షితంగా బయటకు తీసుకువచ్చింది.గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఫ్యాక్టరీలో పాదరక్షల తయారీకి వినియోగించే

రబ్బరు నిల్వలు భారీగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయని అధికారులు భావిస్తున్నారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఖైబర్ పఖ్తుంఖ్వాపై పాక్ సైన్యం కన్ను.. ఖనిజ సంపదే లక్ష్యమా?

పాకిస్థాన్ సైన్యం అనుసరిస్తున్న కఠిన వైఖరి, ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనలకు దారితీస్తున్నాయి. బలప్రయోగంతోనే తిరుగుబాట్లను అణచివేయవచ్చనే ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతం ఇప్పుడు ఈ ప్రావిన్స్‌లో పరీక్షకు నిలిచింది. అయితే, ఈ చర్యల వెనుక అసలు లక్ష్యం ప్రావిన్స్‌లోని అపారమైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవడమేనని అంతర్జాతీయ నివేదికలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

'గ్రీక్ సిటీ టైమ్స్' ప్రచురించిన ఒక కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అకస్మాత్తుగా రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించడం వెనుక పెద్ద వ్యూహం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 11న రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234 కింద అత్యవసర అధికారాలను ఉపయోగించి ఫెడరల్ ప్రభుత్వం ప్రావిన్స్‌లో గవర్నర్ పాలన విధించింది. ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిదిని కస్టడీలోకి తీసుకుంది. పాకిస్థాన్ 18వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఖనిజాలు ప్రావిన్సుల ఆధీనంలో ఉంటాయి. తాజా చర్యలతో ప్రావిన్షియల్ అసెంబ్లీ రద్దవడంతో, ఖనిజాలపై ఫెడరల్ ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించినట్లయింది.

దాదాపు 4 కోట్ల జనాభా, బలమైన రాజకీయ వ్యవస్థ, ఇప్పటికే కొనసాగుతున్న సాయుధ తిరుగుబాటు, పొరుగునే శత్రుదేశంగా భావించే ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు వంటి క్లిష్టమైన పరిస్థితులున్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో సైనిక వ్యూహం బెడిసికొట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భద్రతా వైఫల్యాల కారణంగానే ఎమర్జెన్సీ విధించామని ఇస్లామాబాద్ చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2026 ప్రథమార్ధంలోనే 122 మంది పోలీసులు మరణించగా, హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి.

ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేయడం, ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయడం, ప్రావిన్స్ వనరులను కేంద్రం, విదేశీ కొనుగోలుదారులకు అప్పగించే ప్రయత్నం చేయడం వంటి చర్యలు తీవ్రవాద గ్రూపులకు కొత్త ఆయుధాన్ని అందించినట్లే అవుతుందని ఆ నివేదిక హెచ్చరించింది. ఇది ఖైబర్ పఖ్తుంఖ్వాను కూడా బలూచిస్థాన్ లాగా పాలనారహిత ప్రాంతంగా మార్చే ప్రమాదం ఉందని, ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయం కంటే భద్రతాపరమైన నష్టమే ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రెస్క్యూ మిషన్ విఫలం.. భూమిపై కూలిపోనున్న టెలిస్కోప్

- మొదటి పేజి తరువాయి

అతికష్టంగా ప్రయాణిస్తోంది. నేడో రేపో భూమిపై కూలిపోవచ్చని యూఎస్ స్పేస్ ఫోర్స్ అంచనా వేస్తోంది. సుమారు ఒకటిన్నర టన్ను బరువున్న ఈ పరికరం చాలావరకు వాతావరణంలోనే కాలిపోతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కొన్ని భాగాలు, అద్దాల ముక్కలు మాత్రం భూమిపై పడే అవకాశాలు ఉన్నాయని మిషన్ ముఖ్య శాస్త్రవేత్త, నాసాకు చెందిన బ్రాడ్ సెంకో తెలిపారు. స్విఫ్ట్ అబ్జర్వేటరీ 2004 నవంబర్ 20న అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. విశ్వంలో అత్యంత శక్తిమంతమైన విస్ఫోటనాలైన గామా రే బరస్ట్స్, సూపర్‌నోవాల అన్వేషణకు దీన్ని ప్రయోగించారు. అయితే.. ఇది వేగంగా కిందికి దిగుతుండటంతో రెస్క్యూ చేసే బాధ్యతను 'కాటలిస్ట్ స్పేస్'కు నాసా అప్పగించింది. ఈ ఏడాది జులైలో ఆ సంస్థ ప్రయోగించిన 'లింక్' అనే మూడు చేతుల రోబో ప్రయోగం విఫలమై.. సెప్టెంబర్‌లో భూమిపై కూలిపోయింది.

ఈ క్రమంలోనే అక్టోబర్ నాటికి పరిస్థితి మరింత దిగజారడంతో టెలిస్కోప్‌లోని వ్యవస్థలను నిలిపివేశారు. 'స్విఫ్ట్ అబ్జర్వేటరీ' తన జీవితకాలంలో 2,000కుపైగా గామా రే బరస్ట్స్, 1,400 సూపర్‌నోవాలు, అనేక తోకచుక్కలు, గ్రహశకలాలను, బ్లాక్ హోల్స్‌ను పరిశీలించింది. ఖగోళంలో ఎక్కడైనా విస్ఫోటనాలు జరుగుతున్నప్పుడు ఆ దిశగా అత్యంత వేగంగా (స్విఫ్ట్‌గా)కదిలి దాన్ని కవర్ చేయడం ఈ టెలిస్కోప్ ప్రత్యేకత. అందుకే దీనికి 'స్విఫ్ట్' అనే పేరు పెట్టారు.

## రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది.. రాప్తాడు ఘటనే నిదర్శనం

ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన కిరాతక దాడి ఘటన, టీడీపీ కూటమి పాలనలో నెలకొన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు."రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తరగతి గదిలోనే ఒక విద్యార్థినిపై రంపంతో జరిగిన కిరాతక దాడి.. టీడీపీ కూటమి పాలనలో శాంతిభద్రతలు ఎంతగా విఫలమయ్యాయో స్పష్టం చేస్తోంది. ఒక ప్రభుత్వ పాఠశాలలోకి దుండగుడు స్వేచ్ఛగా ఎలా ప్రవేశించి, ఒక బాలికపై ఇంత దారుణంగా దాడి చేయగలిగాడు? విద్యాసంస్థల్లో కూడా పిల్లలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని జగన్ పేర్కొన్నారు. బాధితురాలిని కాపాడే ప్రయత్నంలో మరో విద్యార్థిని కూడా గాయపడటం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం పాలనను పక్కనపెట్టి, రాజకీయ కక్ష సాధింపులు, 'రెడ్ బుక్' పాలనకే ప్రాధాన్యం ఇస్తోందని, దీనివల్లే నేరస్థులు చట్టమంటే భయం లేకుండా రెచ్చిపోతున్నారని జగన్ ఆరోపించారు. గాయపడిన విద్యార్థినులకు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలని డిమాండ్ చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, పారదర్శక విచారణ ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే సమీక్ష జరపాలని, ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని జగన్ అన్నారు.

**ఘటన వివరాలు, ప్రభుత్వ స్పందన**

రాప్తాడులోని ఓ పాఠశాలలో శనివారం ఓ దుండగుడు తరగతి గదిలోకి ప్రవేశించి పదో తరగతి విద్యార్థినిపై ఎలోక్ట్రిక్ రంపంతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో విద్యార్థిని ముఖం, తల, గొంతు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుడి చేయి దాదాపు తెగిపోయినట్లు సమాచారం. ఆమెను కాపాడబోయిన మరో విద్యార్థిని కూడా తీవ్రంగా గాయపడింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో, వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. మరోవైపు, ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె కోలుకునే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్య బృందాన్ని ఆదేశించానని తెలిపారు. "ఈ ఘాతుకానికి పాల్పడిన మృగాడిని పట్టుకుని, చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీసులను ఆదేశించాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతరం ఆయన బాధితురాలి తల్లితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి కూడా ఆయన ఆరా తీశారు. ఈ ఘటనను నారా లోకేశ్ కూడా తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పోలీసులు విస్తృత స్థాయి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గుర్తించి, అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## స్కూల్‌లో దారుణం..పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో పాశవిక దాడి!

- మొదటి పేజి తరువాయి

ఆమెపై దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఈ ఘటనతో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురయ్యారు.వెంటనే అప్రమత్తమైన ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. దాడికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన బాలికకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.స్కూల్‌లో కొన్ని మరమ్మతు పనులు జరుగుతున్నాయని హెడ్ మాస్టర్ తెలిపారు. నిందితుడు స్కూల్లోకి వస్తున్న సమయంలో ఉపాధ్యాయులు గమనించినప్పటికీ.. వర్కర్ అనుకున్నామని వెల్లడించారు. ఘటన జరిగినప్పుడు తరగతి గదిలో టీచర్ ఉన్నట్లు తెలిపారు. దాడి చేసిన వ్యక్తికి 25-30 ఏళ్ల వయసు ఉండొచ్చని అంచనా వేశారు. సరిగా గమనించే లోపే ఉన్మాది పారిపోయినట్లు పేర్కొన్నారు.కాగా, ధర్మవరం వైపు వెళుతుండగా ఆ ఉన్మాదిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆ యువకుడు బాలికకు సమీప బంధువేనని స్థానికులు చెబుతున్నారు.

## దేశ యువత మిమ్మల్ని క్షమించదు

- మొదటి పేజి తరువాయి

కూర్చొని చర్చించాల్సి రావడం వింతగా ఉందన్నారు. వ్యవస్థలన్నీ తమకు అవకాశం ఇవ్వనప్పుడు మరో మార్గం లేకపోవడంతోనే ఇలా మాక్ పార్లమెంట్ నిర్వహించాల్సి వచ్చిందన్నారు."రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే ఇంటి ఆవరణలో కూర్చొని భారత ఎన్నికల ప్రధాన అధికారి తొలగింపుపై చర్చిస్తున్నాం. చరిత్రలో ఇలా ఎన్నడూ జరగలేదు. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, సాధారణ పౌరుల సమావేశంలా కనిపిస్తున్నప్పటికీ.. వాస్తవానికి ఇదొక రాజకీయ ఆయుధం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎప్పటికీ తప్పించుకోలేరు. ఆ పదవిలో కొనసాగే హక్కు ఆయనకు లేదు. ఇందుకు సంబంధించి మా దగ్గర సరైన ఆధారాలు ఉన్నాయి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మ

**యువత క్షమించదు..**

కేంద్ర ప్రభుత్వంపైనా రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఎన్నికలను తారుమారు చేయడం సహా సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అది తాత్కాలికమేనన్నారు. దేశ యువత మిమ్మల్ని క్షమించదన్నారు.

# వర్షాలకు వరి పంట నష్టం - రైతు ఆవేదన

**నష్టపరిహారం అందించాలని బాధితుడు బీమో వేడుకోలు.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 31.**మండలంలో గల జర్జుల పంచాయతీ, పెద్ద తమ్మెంగుల గ్రామానికి చెందిన రైతు కిల్లో బిమో తన ఎకరం పొలంలో వరి పంట వర్షానికి కొట్టుకుపోయినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆర్నబ్ తుఫాన్ తో పంట వర్షానికి తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో కష్టపడి వరి సాగు చేస్తే తుఫాను ప్రభావంతో పంటలు వరద ఉధృతితో కొట్టుకొని పోయిందని ఆయన అన్నారు. వరి పంట సాగు ఈ ఏడాది బాగానే ఉందని తుఫాను ప్రభావంతో పంట వర్షానికి తడిచి నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి తక్షణమే నష్ట పోయిన వరి పంటకు నష్ట



పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాని వేడుకొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలి

- **ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సమక్షంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**
- **స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి**
- **జిల్లా కలెక్టర్ టి. నిశాంతి**



**పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 31 :**అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి టి. నిశాంతి, ఐఏఎస్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, ఎన్నికల పరిశీలకులు శ్రీ రోణంకి కూర్మనాథ్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌తో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను వివరించారు. సంబంధిత మార్గదర్శకాల ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. వారి సందేహాలను నివృత్తి చేసి, ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూబాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను గౌరవించాలని కోరారు.

కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రచారం చేయరాదు ఎన్నికల ప్రచారంలో కులం, మతం, ప్రాంతం, భాష ప్రాతిపదికన ఓట్లు అభ్యర్థించరాదని తెలిపారు. వివిధ కులాలు, మతాలు, వర్గాల మధ్య విద్వేషాలు, ఉద్రిక్తతలు సృష్టించే ప్రసంగాలు, వ్యాఖ్యలు చేయకూడదన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు తదితర ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదని స్పష్టం చేశారు.ప్రత్యర్థి అభ్యర్థుల వ్యక్తిగత జీవితాలపై నిరాధారమైన ఆరోపణలు చేయకుండా, వారి విధానాలు, కార్యక్రమాలు, ప్రజా కార్యకలాపాలకు సంబంధించిన అంశాలపైనే విమర్శలు పరిమితం చేయాలని సూచించారు.

### ఎన్నికల సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించేందుకు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు పొందాలని తెలిపారు. సభలు, ర్యాలీల వివరాలు, నిర్వహించే ప్రదేశం, మార్గం, సమయాలను ముందుగానే పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు.లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాలని, నిబంధనల ప్రకారం నిర్దేశించిన సమయాల్లోనే వాటిని వినియోగించాలని తెలిపారు. ఎన్నికల ప్రచారం పేరుతో ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించరాదని స్పష్టం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడరాదు ఓటర్లను ప్రలోభపెట్టే ఉద్దేశంతో నగదు, మద్యం, బహుమతులు, వస్తువులు లేదా ఇతర ఆర్థిక ప్రయోజనాలను పంపిణీ చేయడం నిషేధమని తెలిపారు.ఓటర్లను బెదిరించడం, భయపెట్టడం, ఒత్తిడి చేయడం లేదా బలవంతంగా ఓట్లు వేయించుకోవడం వంటి చర్యలకు పాల్పడరాద న్నారు. దొంగ ఓట్లు వేయడం, ఇతరుల పేరుతో ఓటు హక్కును వినియోగించు కోవడం వంటి ఎన్నికల అక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్‌కు ముందు 48 గంటల నిశ్శబ్ద కాలం పాటించాలి పోలింగ్ ముగిసే సమయానికి ముందు 48 గంటల వ్యవధిలో ఎన్నికల ప్రచారం, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించరాదని తెలిపారు. ఈ నిశ్శబ్ద కాలంలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మద్యం విక్రయాలు, పంపిణీపై విధించిన నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో ప్రచారం నిషేధం. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు.పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం, ఓటర్లను అభ్యర్థించడం, ప్రచార సామగ్రిని ప్రదర్శించడం వంటి చర్యలు నిషేధమని పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల సమీపంలో అనవసరమైన జనసమూహాలను ఏర్పాటు చేయరాదని, ఓటర్లకు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించాలని సూచించారు. 44 సమస్యాత్మక, మారుమూల ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకే పోలింగ్ ముగింపు అల్లూరి సీతారామరాజు జిల్లాలో భౌగోళిక పరిస్థితులు, మారుమూల ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల స్థానం, భద్రతాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని గుర్తించిన 44 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 5 గంటలకు బదులుగా మధ్యాహ్నం 3 గంటలకే పోలింగ్ ప్రక్రియ ముగియనుందని జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి తెలిపారు.మిగిలిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు మధ్యాహ్నం 3 గంటలకే పోలింగ్ ముగిసే 44 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పూర్తి జాబితాను కూడా రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమావేశంలో అందజేశారు. ఈ మార్పును దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ఎన్నికల ఏజెంట్లు, కార్యకర్తలు, ఓటర్లకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు.నిర్దిష్ట పోలింగ్ సమయాలను అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు తప్పనిసరిగా గమనించి ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రతి పార్టీకి ఒక పోలింగ్ ఏజెంట్, ఒక రిలీవర్ ఏజెంట్ పోలింగ్ కేంద్రంలో ప్రతి రాజకీయ పార్టీ తరపున ఒక పోలింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చని, అవసరమైనప్పుడు వారి స్థానంలో విధులు నిర్వహించేందుకు ఒక రిలీవర్ ఏజెంట్‌ను కూడా నియమించుకోవచ్చని తెలిపారు.అయితే, పోలింగ్ కేంద్రంలో ఒకేసారి అనుమతించిన సంఖ్యకు మించి ఏజెంట్లు ఉండరాదని, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాలు, సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా తగిన గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని తెలిపారు.

### డమ్మీ బ్యాలెట్ పేపర్ల వినియోగంపై నిబంధనలు

ఓటర్లకు పంపిణీ చేసే ఓటరు స్లిప్పులు సాధారణ తెల్ల కాగితంపై మాత్రమే ఉండాలని తెలిపారు. వాటిపై రాజకీయ పార్టీ పేరు, అభ్యర్థి ఎన్నికల గుర్తు లేదా ప్రచారానికి సంబంధించిన అంశాలు ఉండకూడదని స్పష్టం చేశారు.అలాగే, ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా పింక్ లేదా తెలుపు రంగుల్లో డమ్మీ బ్యాలెట్ పేపర్లను ముద్రించడం, పంపిణీ చేయడం లేదా అసలు బ్యాలెట్ పేపర్లను పోలి ఉండే విధంగా ప్రచార సామగ్రిని తయారు చేయడం చేయరాదని సూచించారు.ఓటర్లను ప్రైవేటు వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించరాదు ఓటర్లను ప్రలోభపెట్టడం లేదా ప్రభావితం చేసే ఉద్దేశంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ సొంత లేదా ప్రైవేటు వాహనాల్లో ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం, తరలించడం చేయరాదని తెలిపారు.ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించు

### కునేలా చూడాలని సూచించారు.

ఎన్నికల సంఘం అనుమతించిన రవాణా సౌకర్యాలు, నిబంధనలు మాత్రమే వర్తిస్తాయని తెలిపారు.ఎన్నికల ఖర్చుల వివరాలు పారదర్శకంగా నిర్వహించాలి ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎన్నికల వ్యయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అన్ని ఖర్చుల వివరాలను రోజువారీగా నమోదు చేసి, సంబంధిత అధికారులకు నిబంధనల ప్రకారం సమర్పించాలని సూచించారు. అక్రమ నగదు లావాదేవీలు, ఓటర్లను ప్రలోభపెట్టే ఖర్చులకు పాల్పడరాదని తెలిపారు.ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదు ప్రభుత్వ వాహనాలు, ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ నిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర అధికారిక వనరులను రాజకీయ ప్రచారానికి వినియోగించరాదని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక పర్యటనలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించకూడదని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో ఎన్నికల సంఘం ఆంక్షలకు విరుద్ధంగా కొత్త పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు ప్రకటించడం, కొత్త పనులకు అనుమతులు మంజూరు చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని పేర్కొన్నారు.పోస్టర్లు, బ్యానర్లు, సోషల్ మీడియా ప్రచారంపై నియంత్రణ ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు ఏర్పాటు చేసేటప్పుడు సంబంధిత నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలని తెలిపారు. ఇతర రాజకీయ పార్టీల ప్రచార సామగ్రిని తొలగించడం లేదా ధ్వంసం చేయడం చేయరాదన్నారు.ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించేటప్పుడు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని, ముందస్తు ధ్రువీకరణ అవసరమైన రాజకీయ ప్రకటనలకు సంబంధిత అనుమతులు పొందాలని సూచించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చు ఎన్నికల సమయంలో నగదు, మద్యం పంపిణీ, ఓటర్లను బెదిరించడం, అక్రమ ప్రచారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన వంటి అంశాలు గుర్తించినట్లయితే సంబంధిత రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల యంత్రాంగం, ఎన్నికల పరిశీలకులు లేదా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో నియమితులైన అధికారులు, పరిశీలకులకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై ఉల్లంఘన స్వభావాన్ని బట్టి వర్తించే ఎన్నికల చట్టాలు, నిబంధనల ప్రకారం కేసుల నమోదు, నిషేధిత వస్తువుల స్వాధీనం, ఎన్నికల ఖర్చుల పరిశీలన తదితర చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ కె. చిరంజీవి నాగ వెంకట సాహిత్, అదనపు ఎస్పీ శ్రుతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు, కార్యకర్తలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని గౌరవించి, ఎన్నికల యంత్రాంగానికి సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి కోరారు.

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు, ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగావ్యవహరించా లని విజ్ఞప్తి చేశారు.

# శ్రమదానంతో పాఠశాల రేకు షెడ్డు నిర్మాణం





- **పాఠశాల భవనంలేక విద్యార్థులు అవస్థలు**
- **కిముడుపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భవనంలేక గ్రామస్తులు శ్రమదానంతో షెడ్డు నిర్మాణానికి శ్రీకారం.**
- **35 మంది విద్యార్థులు పాఠశాల భవనం లేక విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 31.**అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం మారుమూల కుమడ పంచాయతీ, కిముడుపుట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భవనంలేక విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు శ్రమదానంతో పాఠశాల భవన షెడ్డును నిర్మించుకుంటున్నారు. పూర్తిస్థాయి పాఠశాల భవనంలేక చిన్న షెడ్డులో 35 మంది విద్యార్థులు కూర్చుని ఉపాధ్యాయులు బోధించే పాఠాలు నేర్చుకుంటున్నారని, ప్రభుత్వాలు సంబంధించిన అధికారులు పట్టించుకోక పోవడంతోనే శ్రమదానముతో పాఠశాల షెడ్డును నిర్మించుకుంటున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు వెంకటరావు కొర్ర సొమ్ర, జగ్గు, జగబందు, బలరాం, త్రినాథ్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, సంబంధిత అధికారులు మారుతున్నప్పటికీ గిరిజన విద్యార్థుల చదువు మారటంలేదు. పూర్తిస్థాయి పాఠశాల భవనం లేక విద్యార్థుల చదువుకు దూరం అవుతున్నారని, విద్యార్థుల బ్రతుకులు ఎప్పుడు మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణమే గ్రామానికి పాఠశాల భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు వేడుకొనుచున్నారు.

# ఎలక్షన్ కారణంగా 7న శనివారం సంత రద్దు



- **7న జడ్పీటిసి, ఎంపిటిసి ఓట్ల లెక్కింపు మండల కేంద్రంలో 144 సెక్షన్ విధింపు.**
- **శనివారం వారపుసంత రద్దు మైక్ ద్వారా ప్రచారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి.**
- **మండల రిటర్నింగ్ ఎన్నికల అధికారి పి శ్రీనివాసరావు.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 31.**మండల కేంద్రంలో ఈ నెల 7తేదీన జెడ్పిటిసి, ఎంపిటిసి ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మండల కేంద్రంలో 144 సెక్షన్ ఉన్న నేపథ్యంలో శనివారం జరిగే వారపు సంత రద్దు చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం వారపు సంతలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ ఆధ్వర్యంలో మైక్ ద్వారా ఏడో తేదీ మండల కేంద్రంలో జరిగే శనివారపు సంత రద్దు చేయటం జరిగిందని, వారపు సంతకు వచ్చే వ్యాపారస్తులు కొనుగోలుదారులు రావద్దని వారపు సంతలో ప్రతి వ్యాపారికి వివరించారు. జెడ్పిటిసి, ఎంపిటిసి ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 144 సెక్షన్ ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇద్దరు ముగ్గురు ఒక దగ్గర గుమ్మిగూడరాదని మైక్ ద్వారా ప్రచారం చేశారు. ఒడిస్సా ఆంధ్ర ప్రాంతాల వ్యాపారస్తులు వారపు సంతకు కొనుగోలుదారులు శనివారపు సంత రోజు రావద్దని ప్రజలకు మైక్ ద్వారా ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో వీఆర్ఏలు సిహెచ్ నాగేష్, టి దేవన్న పాల్గొన్నారు.

## ఓటర్ స్లిప్ ప్రతి ఒక్కరికి అందేలా పనిచేద్దాం..!

- బి ఎల్ ఓ రత్నకుమారి ఆధ్వర్యంలో



**హుకుంపేట అక్టోబర్ 31 పెన్ పవర్** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండల కేంద్రంలో ఓటర్ స్లిప్పులను

ఇంటింటికి పంచారు తద్వారా ప్రతి ఒక్కరూ తమ యొక్క ఓటును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా బిఎల్ఓ రత్నకుమారి అన్నారు. ఓటర్ స్లిప్పులు ప్రతి ఒక్క ఓటరుకు అందుకునేలా సిబ్బంది పని చేయాలని ఆమె అన్నారు అంతేకాకుండా ఎవరీ అయినా ఓట్లు గల్లంతయిన స్లిప్పులు అందకపోయినా తమను సంప్రదించాలని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు ఓటర్ లు పాల్గొన్నారు

## దొడ్డికొండలో సాగిన సత్యవతి ఎన్నికల ప్రచార జోరు!

- ఇంటింటా పర్యటిస్తూ ఓటర్ల మద్దతు కోరిన వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 30:**దామనపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి సాగిన సత్యవతి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మండల పరిధిలోని దొడ్డికొండ గ్రామంలో ఇంటింటా పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుని మద్దతు కోరారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో వైసీపీ నాయకులు, వంతల చంటిబాబు,కృష్ణ,కర్రయ్య కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పోటీ బరిలో ప్రత్యర్థులు.. పలకరింపుల్లో ఆత్మీయులు!

- పార్టీలు వేరు.. లక్ష్యం ఒక్కటే!
- రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామ్య స్ఫూర్తి!
- పరస్పరం కరపత్రాల పంపిణీతో సరికొత్త సందేశం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్,అక్టోబర్ 31:**ఎన్నికలంటే పోటీలు, రాజకీయ విమర్శలు, ప్రచార హోరు మాత్రమే కాదని.. పరస్పర గౌరవం, ఆత్మీయత, ప్రజాస్వామ్య విలువలు కూడా అంతే ముఖ్యమని జీకే వీధిలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు చాటిచెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎదురుపడిన వివిధ పార్టీల అభ్యర్థులు ఆత్మీయంగా పలకరించుకోవడంతో పాటు పరస్పరం తమ పార్టీ కరపత్రాలను అందజేసుకోవడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థులు సీపీఐ(ఎం)కు చెందిన అంపురంగి బుజ్జిబాబు, వైఎస్సార్సీపీకి చెందిన కంకిపాటి గిరిప్రసాద్‌తో పాటు జీకే వీధి--3 ఎంపీటీసీ అభ్యర్థి బొబ్బిలి లక్ష్మణ్, స్వతంత్ర అభ్యర్థి శెట్టి నాగేశ్వరరావు ఒకచోట కలుసుకున్నారు. ఒకరి పార్టీ కరపత్రాలను మరొకరు అందజేసుకుంటూ స్నేహపూర్వక వాతావరణంలో ముచ్చటించుకున్నారు.ఈ కలయికలో కుందరి రామకృష్ణ, వై. అరుణ్, బాబీ, గిరి, పిండి రామకృష్ణ, మాజీ ఎంపీపీ కుమారి, జీకే వీధి--1 ఎంపీటీసీ అభ్యర్థి పూజారి లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయాల్లో పోటీ ఉండాలి.. వ్యక్తిగత విభేదాలు కాదు!

ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, రాజకీయ అభిప్రాయాలు వేరైనా పరస్పర గౌరవం, స్నేహభావం కొనసాగాలని ఈ ఘటన చక్కటి సందేశాన్ని ఇస్తోంది. ప్రజాస్వామ్యంలో అభ్యర్థులు తమ విధానాలు, అభివృద్ధి ప్రణాళికలతో ప్రజల మనసులు గెలుచుకోవాలి తప్ప వ్యక్తిగత విభేదాలకు తావివ్వకూడదనే భావనకు ఈ ఆత్మీయ కలయిక అద్దం పడుతోంది.

### ప్రజల మధ్య ఐక్యతే అసలైన అభివృద్ధికి పునాది!

గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, గిరిజన ప్రజల సంక్షేమం వంటి అంశాలు ఏ ఒక్క పార్టీకి పరిమితమైనవి కావు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు అతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు సమిష్టి బాధ్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు చూపిన ఈ ఆత్మీయత ఎన్నికల అనంతరం కూడా కొనసాగితే ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుతుంది.పార్టీలు వేరైనా ప్రజలే ముఖ్యం.. రాజకీయాలు వేరైనా ప్రజా సంక్షేమమే పరమావధి కావాలి! అనే సానుకూల సందేశాన్ని జీకే వీధి అభ్యర్థుల ఆత్మీయ కలయిక ప్రజలకు అందించింది.

# అల్లూరి జిల్లాలో రోడ్స్, నెట్ వర్క్, మౌలికవసతుల కల్పనపై, అటవీ అనుమతులపై జిల్లా స్థాయి కమిటీ (డి ఎల్ సి) సమీక్ష మొత్తం 21 అంశాలకు ఆమోదం.

**జిల్లా కలెక్టర్ నిషాంతి. టి**



**పాడేరు పెన్ పవర్ అక్టోబర్ 31 :**అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదించిన వివిధ అటవీ భూముల అనుమతులపై జిల్లా స్థాయి కమిటీ (డి ఎల్ సి) కీలక నిర్ణయాలు తీసుకుంది. శనివారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, సబ్ కలెక్టర్ కె సాహిత్, చింతపల్లి, పాడేరు డివిజనల్ పార్ట్ అధికారులు , ఈఇలు పిఐయు, పిఆర్, ఆర్‌డబి అధికారులు, మండల్ తహశీల్దార్ , పిడి ఐసిడిఏస్, సీడీపీ వలతో అంగన్వాడి బిల్డింగ్స్, రోడ్స్, నెట్వర్క్ కనెక్టివిటీ పై నిర్వహించిన ఈ సమావేశంలో మొత్తం 21 అజెండా అంశాలను పరిశీలించి ఆమోద ముద్రను జిల్లా కలెక్టర్ నిషాంతి. టి. వేశారు.ఈ సమీక్షా సమావేశంలో ప్రధానశీగా రహదారుల నిర్మాణాలకు సంబందించిన 16 అంశాలు పై చర్చిశీచ్చారు. హుకుంపేట, పాడేరు, పెదబయలు, జీ.మాడుగుల, అనంతగిరి మండలాల్లో పలు ప్రధాన రోడ్ల విస్తరణ, పక్కా బీటీ రోడ్ల నిర్మాణాలు కొత్త రహదారుల ఏర్పాటుకు అటవీ అనుమతుల ప్రతిపాదనలను ఆమోదించారు. అలాగే సంచార డ డిజిటల్ కనెక్టివిటీ బి ఎస్ ఎన్ ఎల్ ఓ ఆఫ్ సి – 1 అంశం, పెదబయలు మండలంలోని గుల్లెలు జీపీ నుండి ములుగువీధి వరకు బీఎస్ఎన్ఎల్ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఆఫ్ సి) లైన్ల ఏర్పాటుకు సంబంధించి 0.03 హెక్టార్ల అటవీ భూమి అనుమతి ప్రతిపాదనను కమిటీ పరిశీలించింది. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం 4 అంశాలలో జీ.మాడుగుల మండల పరిధిలోని అంబలమామిడి, కుమ్మరిగుంట, పిల్లగుడ గ్రామాలలో, కొయ్యూరు మండలంలోని బోయవుట కొత్తవీధిలో నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించి స్థల కేటాయింపులు, న అనుమతులపై ఆమోదం తెలిపారు. జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో రహదారి సదుపాయాలు, మౌలిక వసతులు, డిజిటల్ నెట్‌వర్క్ వేగవంతంగా అందుబాటులోకి తెచ్చేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తదుపరి చర్యలు వేగవంతం చేయాలని కమిటీ సూచించింది. ఈ సమావేశంలో ఐటిడి ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, పాడేరు సబ్ కలెక్టర్ కె సాహిత్, పి ఐ యు ఈఇ రామకృష్ణారావు, పిఆర్ ఈఇ పడాల్, ఆర్ అండ్ బి ఈఇ రమేష్, డిప్యూటీ తహశీల్దార్ పోల్రాజు వీడియో కాన్ఫెంట్స్ లో వర్చువల్ గా చింతపల్లి పాడేరు ఫారెస్ట్ అధికారులు, సంబంధిత మండల తహశీల్దార్స్, నెట్వర్క్ కనెక్టివిటీ సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ల మాయాజాలం..



- బుకింగ్ వినియోగదారుల పేరుతో, అమ్మకాలు బ్లాక్ మార్కెట్‌లో!
- ఓటీపీలు తీసుకుని నెలల తరబడి సిలిండర్లకు ఎగనామం?
- శ్రీలక్ష్మి గ్యాస్ ఏజెన్సీపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు!

**అరకులోయ పెన్ పవర్ అక్టోబర్ 31:**అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ పరిధిలో భారత్ గ్యాస్ వినియోగదారుల కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఎస్.కోటకు చెందిన శ్రీలక్ష్మి గ్యాస్ ఏజెన్సీపై స్థానిక వినియోగదారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో గ్యాస్ బుక్ చేసుకున్న వెంటనే వినియోగదారుల నుంచి ఓటీపీలు సేకరిస్తున్నారని, అయితే సిలిండర్లు మాత్రం నెలల తరబడి అందించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులకు చేరాల్సిన సిలిండర్లు ఎక్కడికి వెళ్తున్నాయనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.మరోవైపు బుక్ చేసిన సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించి రూ.1,200 నుంచి రూ.3,000 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే సామాన్య వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నట్లేనని గ్రామస్తులు మండిపడుతున్నారు.

### ఓటీపీలు తీసుకున్నాక సిలిండర్లు ఎక్కడికి వెళ్తున్నాయి?

వినియోగదారుల పేర్లపై బుకింగ్‌లు నమోదు చేసి, వారికి సిలిండర్లు అందించకపోవడంపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ సరఫరా రికార్డులు, డెలివరీ వివరాలు, ఓటీపీ వినియోగంపై సమగ్ర విచారణ చేపడితే అసలు వ్యవహారం బయటపడుతుందని పేర్కొంటున్నారు.

### అధికారుల విచారణకు గ్రామస్తుల డిమాండ్!

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తక్షణమే స్పందించి శ్రీలక్ష్మి గ్యాస్ ఏజెన్సీపై వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అర్హులైన వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందించాలని కోరుతున్నారు.

# జీకే వీధిలో కూటమి ఐక్యతా ప్రకటన.. టీడీపీ శ్రేణుల్లో తొలగిన సందిగ్ధత!

**జనసేన జడ్పీటీసీ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్సీ రాజశేఖర్ పిలుపు**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్,అక్టోబర్ 31:**జీకే వీధి మండలంలో కూటమి అభ్యర్థుల విషయంలో నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ ఎమ్మెల్సీ రాజశేఖర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్వంపూరు గంగులయ్య శనివారం గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో సంయుక్తంగా ప్రకటన చేశారు. కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజశేఖర్ మాట్లాడుతూ.. జీకే వీధి, దుంబ్రిగూడ జడ్పీటీసీ స్థానాల్లో బీజేపీ వేరుగా బీ-ఫారాలు అందించిందని ఆరోపించారు. కూటమి రాష్ట్రస్థాయి నాయకత్వం నిర్ణయించిన అభ్యర్థులకే మద్దతు ఇవ్వాలని స్పష్టం చేశారు. జీకే వీధి జడ్పీటీసీ స్థానంలో జనసేన బలపరిచిన అభ్యర్థి పాంగి కృష్ణారావుకు ఓటు వేసి గెలిపించాలని, టీడీపీ, జనసేన బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థులను కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కూటమి నేతలు మండలంలో పర్యటిస్తూ జడ్పీటీసీ అభ్యర్థి పాంగి కృష్ణారావు, ఎంపీటీసీ అభ్యర్థులు సాగిన భీమేశ్వర్ పడాల్, పాల్స్, పసుపులేటి చైతన్య వర్మ తదితరులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్ల వీర వెంకట్, టీడీపీ మండల అధ్యక్షుడు కొండలరావు, మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, ఏఎంసీ డైరెక్టర్ మొట్టడం శరభన్న దొర, కొయ్యం బాలు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.ముగ్గురు కీలక నేతలు కలిసి చేసిన సంయుక్త ప్రకటనతో జనసేన, బీజేపీ అభ్యర్థుల విషయంలో ఎవరికి మద్దతు ఇవ్వాలనే సందిగ్ధతలో ఉన్న టీడీపీ శ్రేణులకు స్పష్టత వచ్చినట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## పద్మనాభం మండలంలో బుడ్డివలస గ్రామంలో టీడీపీ అభ్యర్థుల విస్తృత ఇంటింటి ప్రచారం

**ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకున్న ఎంపీపీ, జడ్పీటీసీ అభ్యర్థులు**



**పెన్ పవర్ న్యూస్ -- పద్మనాభం**

పద్మనాభం మండలం బుడ్డివలస గ్రామంలో తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ అభ్యర్థులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ అభ్యర్థి కుచ్చెర్లపాటి అరుణకుమారి, జడ్పీటీసీ అభ్యర్థి కోరాడ సత్యవతి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు.ఈ సందర్భంగా కోరాడ రమణ,సత్యవతి గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యలు, ప్రజల అవసరాల గురించి వివరాలు సేకరించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థులు ఓటర్లను కోరారు.గ్రామంలోని ప్రతి వీధిలో అభ్యర్థులు పర్యటిస్తూ ప్రజలను కలుసుకోవడంతో ప్రచారం సందడిగా సాగింది. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ అభ్యర్థులు ముందుకు సాగారని పార్టీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోరాడ రమణతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


**CHANGE OF NAME**

I, **RONANKI LAKSHMANA RAO,** S/o. **Late RONANKI PEDDA BALUSAKU NAIDU**, Permanent Address Door No.1-35, Peddaveedi, Sorligam, Srikakulam. Residing at 14-322/1, Durga Nagar, Sector-3, Arilova, Visakhapatnam, have changed my minor Son name from **RONAKI JASWNTH** (Old Name) to **RONANKI JASWANTH** (New Name). Henceforth, He shall be known and called as **RONANKI JASWANTH S/o. RONANKI LAKSHMANA RAO,** for all purposes.

# పోగొట్టుకున్న 23 సెల్‌ఫోన్ల రికవరీ.. బాధితులకు అందజేసిన ఎస్పీ




**రూ.4.30 లక్షల విలువైన మొబైల్ ఫోన్ల స్వాధీనం**

**రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ అక్టోబర్ 31:** ప్రజల భద్రత, వారి ఆస్తుల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 23 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి, శనివారం జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు తిరిగి అందజేశారు.

పోలవరం జిల్లా పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు వ్యక్తులు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదులపై స్పందించిన పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సెల్‌ఫోన్లను గుర్తించి రికవరీ చేశారు. మొత్తం 23 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, వాటి విలువ సుమారు రూ.4.30 లక్షలుగా అంచనా వేశారు. అనంతరం వాటిని బాధితులకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు జిల్లా ఎస్పీతో పాటు మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి అందజేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ చూపుతున్న చొరవ, బాధ్యత, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సేవలందిస్తామని తెలిపారు. పోగొట్టుకున్న వస్తువులను తిరిగి బాధితులకు అందజేయడం ద్వారా పోలీసులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఓఎస్డీ జావలి ఆల్ఫోన్సా, డీఎస్పీ అష్రఫ్ అలీ, ఏఆర్ డీఎస్పీ సీతారాముడు, ఎస్‌బీ సీఐ భానుప్రసాద్, ఆర్ఐ ప్రసాద్ బాబు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపి నరేంద్రప్రసాద్, ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురం రాజకీయ బరిలో బీఎస్పీ.. ప్రధాన పార్టీల్లో చర్చ!



- దళిత సమస్యలపై పోరాటమే అస్త్రంగా బహుజన సమాజ్ పార్టీ
- జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో యువ అభ్యర్థుల పోటీతో ఆసక్తికరంగా మారిన ఎన్నికల వాతావరణం

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 31:**ఆత్రేయపురం మండల స్థానిక సంస్థల ఎన్నికల బరిలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తన ఉనికిని చాటుకునేందుకు సిద్ధమవుతుండటంతో స్థానిక రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇప్పటివరకు ప్రధాన పార్టీల మధ్యే సాగుతున్న రాజకీయ పోటీలో బీఎస్పీ ప్రవేశం ఎన్నికల వాతావరణానికి కొత్త కోణాన్ని తీసుకొచ్చింది. ముఖ్యంగా దళిత, బహుజన సమస్యలపై గతంలో పార్టీ చేపట్టిన పోరాటాలు, యువతలో పార్టీ పట్ల వ్యక్తమవుతున్న ఆసక్తి ఈ ఎన్నికల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై జరిగిన దాడులు, వివిధ ఘటనలను ప్రశ్నించిన యువకులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారనే ఆరోపణలు అప్పట్లో రాజకీయంగా చర్చకు దారితీశాయి. ఆయా ఘటనల్లో బాధితులకు అండగా నిలిచి న్యాయం జరిగే వరకు బీఎస్పీ పోరాటం చేసిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పోరాటాలను దళిత యువతలోని కొంతమంది ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని స్థానిక రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనూ దళితులపై దాడులు, కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయంటూ బీఎస్పీ వర్గాలు విమర్శలు చేస్తున్నాయి. వైసీపీ, కూటమి ప్రభుత్వాల పాలనలో దళితుల సమస్యలపై తమ వైఖరి భిన్నంగా లేదని ఆరోపిస్తూ ప్రజల్లోకి వెళ్లేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత పార్టీల స్పందనలు, ఆయా ఘటనలకు సంబంధించిన వాస్తవాలు కూడా ఎన్నికల చర్చలో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

యువ అభ్యర్థులతో ఎన్నికల బరిలోకి..

ఈసారి ఆత్రేయపురం జెడ్పీటీసీ స్థానానికి బహుజన సమాజ్ పార్టీ తరఫున యాళ్ల వీరన్నబాబు పోటీకి సిద్ధమవుతుండగా, ర్యాలి ఎంపీటీసీ-2 స్థానానికి చిగురుపాటి సుభాష్ బరిలో నిలుస్తున్నారు. ఇద్దరూ యువ అభ్యర్థులు కావడంతో యువతలో రాజకీయ చైతన్యం, స్థానిక సమస్యలపై చర్చకు అవకాశం ఏర్పడింది.

దళితుల హక్కులు, సామాజిక న్యాయం, యువతకు రాజకీయ ప్రాతినిధ్యం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లాలని బీఎస్పీ శ్రేణులు భావిస్తున్నాయి. ముఖ్యంగా గతంలో వివిధ సమస్యలపై ఉద్యమాల్లో పాల్గొన్న యువత ఈసారి ఎన్నికల్లో ఏ విధంగా స్పందిస్తారన్నది స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ప్రధాన పార్టీలకు కొత్త రాజకీయ సవాల్?

ఆత్రేయపురం మండలంలో ఇప్పటివరకు రాజకీయంగా ఆధిపత్యం కొనసాగిస్తున్న కూటమి, వైసీపీ పార్టీలకు బీఎస్పీ అభ్యర్థుల పోటీ కొత్త రాజకీయ చర్చకు తెరలేపింది. దళిత, బహుజన వర్గాల సమస్యలు, యువత ఆకాంక్షలు, స్థానిక అభివృద్ధి అంశాలు ఈ ఎన్నికల్లో ఎంతవరకు ప్రాధాన్యం పొందుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

మొత్తంగా ఆత్రేయపురం మండల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థుల రంగప్రవేశంతో రాజకీయ సమీకరణాలపై చర్చ మొదలైంది. ప్రధాన పార్టీలతో పాటు బీఎస్పీ కూడా తన రాజకీయ ఉనికిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండటంతో ఈసారి ఎన్నికల పోటీ మరింత బహుముఖంగా మారింది. ప్రజలు అభ్యర్థులపై, వారి విధానాలపై, స్థానిక సమస్యల పరిష్కారంపై ఏ విధంగా స్పందిస్తారన్నది ఎన్నికల ఫలితాల అనంతరం స్పష్టమవుతుంది.

## ఆదిత్య యూనివర్సిటీలో జాతీయ ఐక్యతా దినోత్సవం




**గండేపల్లి, పెన్ పవర్,అక్టోబర్ 31:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ, భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా 31 అక్టోబర్ 2026న రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస రెడ్డి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డా.ఎం.ఎస్.రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులు జాతీయ సమైక్యత, ఐక్యత, సమగ్రత, దేశభక్తి మరియు జాతీయ సమగ్రత పట్ల అవగాహన పెంపొందించడం అని భారతదేశం ఐక్యత మరియు సమైక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన విశేష కృషి, ఆయన నాయకత్వ లక్షణాలు, దేశ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రసంగ నైపుణ్యాలను, ఆలోచనా సామర్థ్యాన్ని మరియు దేశభక్తి భావాలు వ్యక్తం చేశారు. డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా. డి. కిషోర్ మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తుకు ప్రతినిధులని, వారిలో ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర గౌరవం మరియు సామాజిక బాధ్యత వంటి విలువలు పెంపొందాలని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వక్తృత్వ నైపుణ్యాలు మరియు జాతీయ భావనలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. బి. రాంబాబు , ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ కన్వీనర్ డా. ఐ. వి. వీరాంజనేయులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

- విజేతలకు నగదు బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసిన ఎస్పీ కె. చక్రవర్తి

**రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ అక్టోబర్ 31:**(పోలీస్ అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి అన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలవరం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్ల పరిధిలోని హైస్కూల్, జూనియర్ కళాశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు, వారి సేవలు, సమాజ రక్షణలో పోలీసుల పాత్ర వంటి అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి నగదు బహుమతులతో పాటు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 చొప్పున అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, దేశం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఓఎస్డీ అడ్మిన్ జావలి ఆల్ఫోన్సా, డీఎస్పీ అష్రఫ్ అలీ, చింతూరు డీఎస్పీ ఉదయ పావని, రిజర్వ్ డీఎస్పీ సీతారాముడు, ఆర్ఐ ప్రసాద్ బాబు, ఎస్‌బీ సీఐ భానుప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్వార్ దాస్ జయంతి వేడుకలు

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 31:** స్థానిక పెన్షనర్ల భవనంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పి. వీర్రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ 103 గవర్నర్ తోలేటి సూర్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, నడు నడిపించు, ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆల్వార్ దాసు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తకొండ బాబు, అధ్యక్షులు పొట్టి వీర్రాజు,యం.మల్లేశ్వరావు , వెత్సా నాగ సత్య తదితరులు పాల్గొన్నారు .



## మా పార్టీకు ఓటేయండి. మా పార్టీకి ఓటేయండి వివిధ పార్టీల అభ్యర్థులు

**పోటాపోటీగా స్థానిక ఎన్నికల ప్రచారాలు.**



**హుకుంపేట అక్టోబర్ 31 పెన్ పవర్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండల కేంద్రంలో శనివారం పోటాపోటీగా స్థానిక ఎన్నికల ప్రచారాలు జరిగాయి దీనిలో భాగంగా కూటమి తరపున జడ్పిటిసి ఎన్నికల్లో పాల్గొన్న అభ్యర్థి మఠం శాంతి కుమారి మరియు హుకుంపేట సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి. సిరగం సూర్యకాంతం. మరియు 14 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన పలువురు ఎంపీటీసీ అభ్యర్థులు మరియు కూటమి అభ్యర్థుల జనసేన కార్యకర్తలు నాయకులు భారీగా ర్యాలీ నిర్వహిస్తూ తమతమ ఏజెండాలను ప్రజలకు తెలియజేశారు అంతేకాకుండా ప్రభుత్వానికి ఓటేస్తే గ్రామ అభివృద్ధికి సహకరిస్తామంటూ తమ శైలిలో వారు. ఓటర్లను ఆకట్టుకుని ప్రయత్నం చేశారు. అంతేకాకుండా వైసిపి ప్రచారం కూడా ర్యాలీ నిర్వహించి ప్రజలను ఆకట్టుకునే విధంగా. వైసిపి జడ్పిటిసి అభ్యర్థి ఒంటోబు ప్రియాంక మరియు ఎంపీటీసీ అభ్యర్థిగా వండాలి నాగేశ్వరరావు. సిపిఎం అభ్యర్థిగా మూర్తి తదితరులు వారి ప్రచారాలను వారివారి సైలిలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీ కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## లోతేరు సంతలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం హోరు!

- గిరిజన అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం -- జెడ్పీటీసీ అభ్యర్థి పాచిపెంట శాంతకుమారి
- కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం!



**అరకులోయ పెన్ పవర్అక్టోబర్ 31:**అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకువెల్లి మండలంలోని లోతేరు సంతలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. జెడ్పీటీసీ అభ్యర్థి పాచిపెంట శాంతకుమారి, లోతేరు సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి పాంగి గంగాధర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఓటర్లను ఆకట్టుకున్నారు.

ఈ సందర్భంగా జెడ్పీటీసీ అభ్యర్థి పాచిపెంట శాంతకుమారి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ఆదివాసీల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో పాటు వైసీపీ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.అక్కాచెల్లెమ్మలకు ఇందిరమ్మ రాజ్యం.. ప్రతి ఇంటా సౌభాగ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజలు ఒక్క అవకాశం కల్పిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాచిపెంట చిన్నస్వామి, మాదల డేవిడ్, అప్పలనాయుడు, రాజేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

## ఎన్నికల విధులపై సిబ్బందికి పకడ్బందీ శిక్షణ!

- అరకులోయలో రెండో రోజు కొనసాగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల శిక్షణ కార్యక్రమం
- పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారుల సూచన

**అరకులోయ పెన్ పవర్ అక్టోబర్ 31:**ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బందికి రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం (31-10-2026) అరకులోయ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు.

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీమతి నిశాంతి టి., ఐఏఎస్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం ప్రిసైడింగ్ ఆఫీసర్లకు, మధ్యాహ్నం అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ అందించారు.పోలింగ్ విధానాలు, ఎన్నికల నిబంధనలు, బ్యాలెట్ పేపర్ల వినియోగం, ఓటింగ్ ప్రక్రియ, పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల విధుల్లో పాటించాల్సిన నియమాలపై మాస్టర్ ట్రైనర్లు సమగ్రంగా వివరించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు.పోస్టల్ బ్యాలెట్‌కు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు.ఈ కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లా పోస్టల్ బ్యాలెట్ అధికారి శ్రీ ఎస్.బి.ఎస్.డి. నాథ్ హాజరయ్యారు. ఆదివారం అరకులోయ మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక సౌకర్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధులకు కేటాయించబడిన సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీ మదంశెట్టి శ్రీధర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్--1, ఎంపీడీవో వీసం ప్రసాద్, తహసీల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్--2 శ్రీ గుంటూరు రాజా శ్రీధర్, మండల విద్యాశాఖ అధికారులు వి. త్రినాథరావు, ప్రధాని భారతీరత్నం, ఏటీడబ్ల్యూ వెంకట్రావు, జిల్లా మాస్టర్ ట్రైనర్, మండల మాస్టర్ ట్రైనర్లు శ్రీ పాల్, శ్రీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరం ఎక్సైజ్ పరిధిలో అక్రమ బెల్ట్ షాపులపై కఠిన చర్యలు

- రెండు నెలల్లో 24 కేసులు నమోదు.. 24 మంది అరెస్ట్
- 2026లో ఇప్పటివరకు 93 బెల్ట్ షాపు కేసులు నమోదు
- ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్

**రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ అక్టోబర్ 31:**రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపుల నియంత్రణకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. పోలవరం జిల్లా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత రెండు నెలల్లో 24 బెల్ట్ షాపు కేసులు నమోదు చేసి, 24 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి 25.56 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏఈఎస్‌టీఎఫ్ బృందం సహకారంతో 2026 సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 93 బెల్ట్ షాపు కేసులు నమోదు చేసి, 93 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 114.96 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ కేసులకు సంబంధించి 68 మందిని సంబంధిత తహశీల్దార్ల ఎదుట హాజరుపరిచి, భవిష్యత్తులో నేరాలకు పాల్పడకుండా బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు 128, 129 కింద బైండోవర్ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.మద్యం దుకాణాలపై నిరంతర నిఘా ఉంచేందుకు ఇప్పటివరకు 179 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ఏ-4 మద్యం దుకాణాల నుంచి మద్యం నాణ్యత, కల్తీ నిర్ధారణ కోసం 26 నమూనాలను సేకరించి పరీక్షలకు పంపగా, ఎలాంటి అక్రమాలు గుర్తించబడలేదని స్పష్టం చేశారు.అక్రమ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలను ఖండించిన ఆయన, ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ప్రజల దృష్టికి వస్తే వెంటనే రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అక్రమ మద్యం విక్రయ కేంద్రాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖతో పాటు ఏఈఎస్‌టీఎఫ్ బృందాలు తమ పరిధిలో నిరంతరం గట్టి నిఘా కొనసాగిస్తున్నాయని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ స్పష్టం చేశారు.



## పరిషత్ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలి




**సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎం. గౌతమి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ అక్టోబర్ 31:** జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా మైక్రో అబ్జర్వర్లు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎం. గౌతమి స్పష్టం చేశారు. శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నియమి తులైన మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్. గౌతమి మాట్లాడుతూ, సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఎవరి ప్రభావానికీ లోనుకాకుండా ఎన్నికల నిబంధనల ప్రకారం విధులను గమనించా లన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, గోప్యతతో వినియోగించుకు నేందుకు తగిన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు ప్రత్యక్షంగా గమనించిన వాస్తవాలను నివేదికల్లో నమోదు చేయాలని, వినికిడి మాటలు, అపోహల నివేదికలు రూపొందించరాదని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం నిర్దేశిత చెక్‌లిస్ట్‌ను పూర్తి చేసి, తమ పరిశీలనలతో కూడిన నివేదికను రిసెప్షన్ కేంద్రంలోని అబ్జర్వర్ డెస్క్ వద్ద నేరుగా అందజేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శ కాలను తప్పకుండా పాటిస్తూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు సహకరిం చాలని పిలుపునిచ్చారు.

జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎం. రాజు మాట్లాడుతూ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై మైక్రో అబ్జర్వర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా, శాంతిభద్రతలకు విఘాతం కలిగినా అనుసరించాల్సిన ప్రామాణిక నిర్వహణ విధానాలను తెలుసుకోవాలన్నారు. జనరల్ అబ్జర్వర్‌కు నివేదికలపై స్పష్టత కలిగి ఉండాలని, సందేహాలుంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎల్‌డీఎం డి.వి. ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. పోలింగ్ నుంచి బ్యాలెట్ బాక్సులను సీల్ చేసే వరకు వివిధ అంశాలను మాస్టర్ ట్రైనర్లు వివరించారన్నారు.

ఈ కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ అభివృద్ధి అధికారి కె. శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం డివిజన్ అభివృద్ధి అధికారి పి. వీణాదేవి . జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నియమితులైన మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## నగరపాలక కార్యాలయంలో విజిలెన్స్ వారోత్సవాలు




**అడిషనల్ ఎస్పీ(ఏసీబీ) భవ్య కిషోర్**

**రాజమహేంద్రవరం పెన్ పవర్, అక్టోబర్ 31:**విధి నిర్వహణలో ప్రలోభాలకు గురికా కుండా, అవినీతికి లొంగకుండా నిజాయితీ గా పని చేయడం ప్రతి ఉద్యోగి ప్రాథమిక బాధ్యత అని అడిషనల్ ఎస్పీ(ఏసీబీ) భవ్య కిషోర్ అన్నారు. నగరపాలక కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పీసీ యాక్ట్(పీవెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్-1988), ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (ప్రవర్తన) నియమావళి - 1964, సీసీఏ రూల్స్-1991, విజిలెన్స్ మాన్యువల్ పై అవగాహన కల్పించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ(ఏసీబీ) భవ్య కిషోర్ మాట్లాడుతూ విజిలెన్స్ వారోత్సవా లలో భాగంగా సమాజంలో అవినీతిని రూపుమాపడం కోసం వివిధ రంగాలలోని ప్రజలకు అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాలనలో నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం, అవినీతి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేయు ఉద్యోగులు బాధ్యతాయుతమైన పదవుల్లో అనేక రకాల ఆకర్షణలు, లంచాలు లేదా వ్యక్తిగత ప్రయోజనాల ప్రలోభాలు ఎదురుకావచ్చన్నారు. నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే చట్టపరమైన ఇబ్బందుల రక్షించుకోవచ్చన్నారు. చేయవలసిన పనిని చేయకపోవడం, నిర్లక్ష్యం వహించడం లేదా ఉద్దేశపూర్వకంగా వదిలేయడం కూడా అవినీతినని అడిషనల్ ఎస్పీ అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు నైతిక ప్రమాణాలు, నిజాయతీతో పనిచేయాలన్నదే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి పాటుప డదామని ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో అదనపు కమిషనర్(ఆర్.ఎం.సి) పీవీ రామలింగేశ్వర్, సీఐ(ఏసీబీ) ఎన్.వి.భాస్కర్ రావు, ఇన్స్ పెక్టర్లు(ఏసీబీ) కె.గోవిందరాజు, డి.వాసు కృష్ణ, మునిసిపల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రూ.65 వేల లంచంతో ఏసీబీకి పట్టుబడ్డ ఏడీఎఫ్ఓ

### ఐదు బాణాసంచా దుకాణాలకు ఫైర్ ఎన్ఓసీల కోసం డిమాండ్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 31:**రానున్న దీపావళి పండుగ సందర్భంగా నగరంలో ఐదు బాణాసంచా దుకాణాలకు ఫైర్ ఎన్ఓసీలు జారీ చేయడంతో పాటు తనిఖీల కోసం రూ.65 వేల లంచం తీసుకుంటూ రాజమహేంద్రవరం సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి పి. శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం ఐదు బాణాసంచా దుకాణా లను నిర్వహిస్తున్న (పేసో లైసెన్సులు 2028- 2035 వరకు చెల్లుబాటులో ఉన్నాయి) ఫిర్యాదుదారుడిని ఒక్కో దుకాణానికి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.75 వేలు ఇవ్వాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చివరకు రూ.65 వేలు తీసుకునేందుకు అంగీకరించారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు అక్టోబర్ 30 న సాయంత్రం 6.44 గంటలకు కోటిపల్లి బస్‌స్టాండ్ సమీపంలోని కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, ఆయన కుడిచేతి వేళ్లకు నిర్వహించిన ఫినాఫ్తలీన్ పరీక్షలో పాజిటివ్‌గా గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరచ నున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అదనపు ఎస్పీ కోరారు. ఈ దాడిలో అదనపు ఎస్పీ ఎస్. భవ్య కిషోర్, ఇన్‌స్పెక్టర్లు ఎన్.వి. భాస్కరరావు, డి. వాసుకృష్ణ, వై. సతీష్, కె. గోవిందరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 31:**రూరల్ మండలంలోని సాటిలైట్ సిటీలో జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు 5వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. సాటిలైట్ సిటీకి చెందిన బండ దుర్గారావు ఇంటి పక్కనే నివాసం ఉంటున్న పోలవరపు పాండవులు, పోలవరపు శివ, పోలవరపు లక్ష్మి అనే ముగ్గురికి కల్లు విక్రయించడం లో గతంలో బండ దుర్గారావుతో గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో బండ దుర్గారావును చంపేస్తా మని నిందితులు బెదిరించేవారు.ఈ క్రమంలో 26-06-2023 తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో బండ లోవ పెంపుడు కుక్క వీధిలోకి వెళ్లడంతో, కుక్కను పదిలేయడాన్ని సాకుగా నిందితులు పథకం ప్రకారం బండ దుర్గారావు తో గొడవకు దిగారు. ఈ సందర్భంగా పోల వరపు శివ, పోలవరపు లక్ష్మి కలిసి బండ దుర్గారావు చేతులను వెనుకకు విరిచి పట్టుకోగా, పోలవరపు పాండవులు కత్తితో అతని కడుపులో పలుమార్లు పొడిచి హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఈ దాడిని అడ్డుకోవడానికి వచ్చిన బండ నరసింహారావుపై కూడా విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి పొట్టలో పలుమార్లు పొడిచారు. బాధితుల కేకలు విని చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు.

ఈ ఘటనపై బండ లోవ, భర్త బండ దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ కుమార్ హత్య యత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తిచేసి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ లో బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి. కాశీ విశ్వనాథం కోర్టు కానిస్టేబుల్ లీలా కుమార్ , హెడ్ కానిస్టేబుల్ విశ్వేశ్వ రరావు లు సాక్షులను న్యాయస్థానం లో ప్రవేశపెట్టి, కేసు విచారణ జరిగేలా చర్యలు తీసుకున్నారు.విచారణ అనంతరం 5వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్. సుజాత ముగ్గురు నిందితులైన పోలవరపు పాండవులు, పోలవరపు శివ, పోలవరపు లక్ష్మి లకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున 5వ అదనపు జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నామ సత్యనారాయణ వాదనలు వినిపించారు.

ఈ కేసు దర్యాప్తు నిర్వహించి, నిందితులకు శిక్ష పడేలా చేసిన బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు కానిస్టేబుల్ లీలా కుమార్ , హెడ్ కానిస్టేబుల్ విశ్వేశ్వర రావు ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నామ సత్యనారాయణ లను జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, అభినందించారు.

## చామగడ్డ ఎంపీటీసీ స్థానానికి ఇద్దరు కూటమి అభ్యర్థులు పోటీ



**వై రామవరం, పెన్ పవర్,అక్టోబర్ 31** : మండలంలోని చామగడ్డ ఎంపీటీసీ స్థానానికి ఇద్దరు కూటమి అభ్యర్థులు పోటీలో ఉన్నారు. చామగడ్డ ఎంపీటీసీ స్థానానికి నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా, ఇందులో వైయస్సార్సీపి అభ్యర్థి ఒకరు కాగా మరొక వ్యక్తి ఇండిపెండెంట్ గా ఉన్నారు. కూటమి అభ్యర్థులుగా టిడిపి నుండి పల్లాల వెంకటరమణారెడ్డి, జనసేన అభ్యర్థిగా రావడిపుష్పరాజు ఆయా పార్టీల బీ ఫారాలు సమర్పించారు. దీంతో ఓటర్ లు సందిగ్ధంలో ఉన్నట్లు తెలిసింది. సీట్ల సర్దుబాటులో చామగడ్డ ఎంపీటీసీ స్థానం జనసేన పార్టీకి ఇచ్చారని కొందరు నాయకులు అంటున్నారు.

## నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారం జోరు..



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబరు 31.**తాడేపల్లిగూడెం నియోజకవర్గం, మండలంలో రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని, కూటమి అభ్యర్థులకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, గ్రామాల అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కూటమి నాయకులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.ఈ ఎన్నికలు గ్రామస్థాయి అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో కీలకమని, ప్రజల ఆశీర్వాదంతో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మన గ్రామం -- మన అభివృద్ధి -- ఎన్డీఏ కూటమి విజయం అని ఎమ్మెల్యే అన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికలపై ఎన్నికల అధికారులతో సమావేశం.

**హ్యాండ్ బుక్, లాబుక్ అందజేత.**



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 31.**తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అన్ని ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ ఎమ్. యేసుబాబు అధ్యక్షతన వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారులందరికీ బిఎన్నికల హ్యాండ్ బుక్ ను ,మున్సిపల్ మాన్యువల్ లా బుక్ అందజేసి, ఎన్నికల నియమ నిబంధనలు, విధి విధానాలపై సూచనలు, ఇవ్వడం జరిగింది అన్నారు.ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేలా అందరూ సమన్వయంతో పని చేయాలని కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి భవాని బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి సీతారాం, మున్సిపల్ మేనేజర్ పి ప్రసాదరావు, టౌన్ ప్లానింగ్ అధికారి వి జగదీశ్వర రావు, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు మేనేజర్ నాగరాజు , ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలి



**రాజమహేంద్రవరం పెన్ పవర్, అక్టోబర్ 31:**ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో బహుజన సమాజ్ పార్టీ తరపున తూర్పు గోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 22 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ వెల్లడించారు. అన్ని సామాజిక వర్గాల ప్రాధాన్యత ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో బిఎస్పీ అభ్యర్థులను పరిచయం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ప్రాంతాల్లో ఇతర పార్టీల అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా దౌర్జన్యాలు ,దాడులు, ప్రలోభాలకు గురిచేయడం, వేలం పాటలు జరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేసారు. ప్రజాస్వా మ్యంలో ఓటు విలువైనదని వృధా కాకుండా సరైన అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవాలని కోరారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్ స్థానాలకు పోటీచేస్తున్న బిఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఇసకపట్ల రాంబాబు మాట్లాడుతూ పెరిగిన బియ్యం, నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు బ్రతకలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. చంద్రబాబు అధికారంలో ఉంటే ఒక మాట.. లేక పోతే మరో మాట మాట్లాడతారని విమర్శించారు. చంద్ర బాబు తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై ధరలు నియంత్రణ చేయడం లేదని ఆరోపించారు. బిఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బిఎస్పీ జిల్లా, నియోజకవర్గాల నాయకులు కొండపల్లి సూరిబాబు, కె.అబ్బులు, కొంకి రమేష్, కొత్తపల్లి శేఖర్, మోర్త పవన్, కె.మోహన్, అనపర్తి శ్రీను, కోరుకొండ, సీతానగరం జడ్పీటీసీ అభ్యర్థులు కన్నాబత్తుల హైమావతి, గంగిడేసి వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆరోగ్య సేవల పై డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి సమీక్ష



**రాజమహేంద్రవరం పెన్ పవర్, అక్టోబర్ 31:**తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయను శనివారం ని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా. వెంకటరమణ సందర్శిం చారు. జిల్లా వైద్య కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశము ఏర్పాటు చేసారు. అన్ని ఆరోగ్య సేవలు, ఆసుపత్రుల్లో ప్రసవాలు, సిజేరియన్ , ఇమ్యు నైజేషన్, మాతృ మరణాలు ,శిశు మరణాలు, ఎన్ సి డి, లెప్రసీ, టీ బి, హెచ్ఐవి, ఎఫ్ఆర్ఎస్, డ్రగ్స్ (మందులు), మలేరియా, సీజనల్ వ్యాధుల గురించి హెచ్ పి ఆర్, హెచ్ ఎఫ్ ఆర్ మొదలైన కార్య క్రముల గురించి సమీక్ష చేశారు. తదనంత రం సిబ్బందికి తగు సూచనలు సలహాలు చేసారు. ఆరోగ్య కార్యక్రమములపై సిబ్బంది పనితీరును ప్రశంసించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న సంజీవిని కార్యక్రమము గురించి సమీక్షించారు. సంజీవిని ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రో ఫైల్ అయి ఉంటుందని, సంజీవిని లక్ష్యం జబ్బు వచ్చాక ట్రీట్మెంట్ కాదు ముందే జబ్బును గుర్తించడం అని తెలియజేశారు. దవలేశ్వరం పిహెచ్ సి సందర్శించి అన్ని ఆరోగ్య కార్యక్రమముల యాఫ్ లను,రికార్డులను తనిఖీ చేసారు.

## గంగవరం మండలంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం

**జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటాం: మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు**



**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 31**: గంగవరం మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని ఆ పార్టీ మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రం గంగవరంలో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి బల్లెం శివదొర, లక్కొండ ఎంపీటీసీ అభ్యర్థి మడకం శివదొరకు మద్దతుగా పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాత గంగవరం, కొత్త గంగవరం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం కొత్త గంగవరం నుంచి పాత గంగవరం వరకు పాదయాత్రగా ర్యాలీ నిర్వహించి వారపు సంతలో ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కె. గంగాదేవి, వైఎస్సార్‌సీపీ అరకు జిల్లా కార్యదర్శులు సూరంపూడి ఏడుకొండలు, దిండి నాగమహేష్ (బాబి), మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు దొర (గిరి), సూరంపాలెం పీసా ఉపాధ్యక్షుడు దొంగ బాబుదొర, పార్టీ నాయకులు ప్రవీణ్, రమేష్, బాపనదొర తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావిత తోటల్లో కె.వి.కె శాస్త్రవేత్తల పర్యటన:

**రైతులకు పంట పునరుద్ధరణ సూచనలు.**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 31.**డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావు ఆదేశాల మేరకు, ఆర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం – కెవికె శాస్త్రవేత్తల బృందం శనివారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించింది.

కెవికె హెడ్ ఁ సీనియర్ శాస్త్రవేత్త డా. సీహెచ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులు బాదంపూడి గ్రామంలో దెబ్బతిన్న బొప్పాయి తోటలను పరిశీలించారు.ఈ సందర్భంగా పంటల పునరుద్ధరణకు గానూ తోటల నుండి తక్షణమే నీటిని బయటకు పంపాలని, వేరుకుళ్లు నివారణకు రిడోమిల్ (లీటరుకు 2 గ్రా.) పోయాలని, వైరస్ సోకిన మొక్కలను నాశనం చేయాలని సూచించారు. అలాగే పండ్ల ఈగ నివారణకు దెబ్బతిన్న పండ్లను పూడ్చిపెట్టాలని, పంట కోలుకోవడానికి జింక్ సల్ఫేట్, బోరాన్, యూరియా మిశ్రమాన్ని పిచికారీ చేయడంతో పాటు పడిపోయిన మొక్కలకు తగిన ఆధారం కల్పించాలని రైతులకు శాస్త్రీయ సలహాలు అందించారు.ఉపకులపతి ఆదేశాలతో, శాస్త్రవేత్తలు బృందాలుగా ఏర్పడి ఆయా ప్రాంతాల్లో ప్రతిరోజూ పర్యటిస్తూ, ఫోన్ ద్వారా, వాట్సాప్ ద్వారా తగిన సూచనలు, సాంకేతిక సలహాలు అందిస్తున్నామని డా. కిరణ్ కుమార్ తెలియచేశారు.ఈ క్షేత్రస్థాయి పర్యటనలో డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా. సీహెచ్ రూత్, విశ్వవిద్యాలయ డీన్ డా. బి. ప్రసన్న కుమార్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎన్.బి.వి.




చలపతిరావు, ప్రొఫెసర్లు డా. ఈ. కరుణశ్రీ, డా. టి. నాగలక్ష్మి, డా. చెన్నకేశవులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. ఎం. రాఘవేంద్ర రెడ్డి, డా. శిరీష మరియు కెవికె శాస్త్రవేత్తలు డా. రేఖ, డా. దేవీప్రసాద్ రెడ్డి, ఉద్యాన కళాశాల విద్యార్థులు పంట నష్టాల పరిశీలనలో చురుకుగా పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

**రంపచోడవరంలో 5కే రన్.. ఉత్సాహంగా పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ**







**రంపచోడవరం, పోలవరం బ్యూరో పెన్ పవర్ అక్టోబర్ 31**: భారతదేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని పోలవరం జిల్లా రంపచోడవరంలో శనివారం జాతీయ ఐక్యతా దినోత్సవం (ఏక్తా దివస్) వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి జాగారంపల్లి వరకు నిర్వహించిన 5కే రన్‌లో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, ఎస్పీ కె. చక్రవర్తి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, యువతతో కలిసి పరుగు సాగిస్తూ జాతీయ ఐక్యత సందేశాన్ని చాటారు. అనంతరం జాతీయ ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు అని, ప్రజలందరూ ఐక్యతా భావంతో ముందుకు సాగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ సమైక్యతను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢ సంకల్పం, నాయకత్వ పటిమ, దేశ సమైక్యత కోసం చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజల్లో జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. యువత క్రీడలు, వ్యాయామం పట్ల ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించాలని సూచించారు.స్వాతంత్ర్య సమరయోధుడిగా, స్వతంత్ర భారతదేశ తొలి ఉప ప్రధానిగా, తొలి హోం మంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి విశేష సేవలందించారని అధికారులు కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి అఖండ భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేశారని గుర్తుచేశారు. ఆయన ధైర్యం, పట్టుదల, దృఢ సంకల్పం కారణంగానే ఉక్కు మనిషిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ డి. పృథ్వీరాజ్ కుమార్, ఓఎస్డీ జావలి, సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు అష్రఫ్ అలీ, పావని, సీతారాం, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, పి.వి. నాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఈగల్ టీమ్ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల 7 వరకు నన్నయ యూనివర్సిటీ సెలవులు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 31** :ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఆదికవి నన్నయ విశ్వవి ద్యాలయం క్యాంపస్‌ను ఎన్నికల కార్యకలా పాలకు క్యాంపస్ కు నవంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు.ఈ మేరకు యూనివర్సిటీ ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కె. రమేష్ అక్టోబర్ 31న సర్క్యులర్ జారీ చేశారు. నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, నవంబర్ 7 ప్రకటించారు. సెలవుల సమయంలో విద్యార్థు లకు విద్యా కార్యక్ర మాలకు ఆటంకం కలగకుండా ఆన్‌లైన్ తరగతులు నిర్వ హించాలని సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. అకడమిక్ షెడ్యూల్‌కుఅంతరాయం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల కారణంగా యూనివర్సిటీ క్యాంపస్ నో మాన్ జోన్ సర్టిఫికెట్లు కొరకు సెలవుల్లో ఎవరూ రావద్దని విజ్ఞప్తి చేశారు.

## అర్నబ్ తుపాను నష్టంపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన

**దొమ్మేరు గ్రామంలో దెబ్బతిన్న అరటి, బొప్పాయి, వరి పంటల పరిశీలన -- రైతులతో ముఖాముఖి**



**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 31:**అర్నబ్ తుపాను ప్రభావంతో తూర్పు గోదావరి జిల్లాలో సంభవించిన పంట, ఆస్తి నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఇందులో భాగంగా కొవ్వూరు మండలం, దొమ్మేరు గ్రామంలో అర్నబ్ తుపాను కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలను బృంద సభ్యులు పరిశీలించారు. ముఖ్యంగా గాలుల తీవ్రతకు నేలకొరిగిన అరటి తోటలు, దెబ్బతిన్న బొప్పాయి చెట్లు, వరి పంట పరిస్థితిని పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. తుపాను ప్రభావం ఎప్పుడు ప్రారంభమైంది, పంటలు ఏ మేరకు దెబ్బతిన్నాయి, ఎంత విస్తీర్ణంలో నష్టం సంభవించింది, ఒకే ప్రాంతంలో ఇతర రైతుల పంటలకూ నష్టం వాటిల్లిందా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అరటి పంటలో కాయ గెలలతో సహా చెట్లు నేలకొరిగాయని, బలమైన గాలుల కారణంగా పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని అధికారులు బృందానికి వివరించారు. సాధారణంగా అరటి తోటలు గంటకు సుమారు 50 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులను కొంతవరకు తట్టుకోగలిగినప్పటికీ, తుపాను సమయంలో 100 కిలోమీటర్లకు పైగా వేగంతో వీచిన బలమైన గాలుల కారణంగా చెట్లు పడిపోయాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు అరటి చెట్లకు ఆసరా ఏర్పాటు చేసినప్పటికీ గాలుల తీవ్రతకు పంటను కాపాడుకోలేకపోయారని వివరించారు. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు ఉపగ్రహ చిత్రాలు, రిమోట్ సెన్సింగ్ సమాచారాన్ని ఉపయోగించి నష్టాన్ని అంచనా వేసే అంశాలపై కూడా బృంద సభ్యులు చర్చించారు. ఒకటి నుంచి ఐదు మీటర్ల స్థాయి అధిక రిజల్యూషన్ ఉపగ్రహ డేటా అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని, అయితే మేఘావృత వాతావరణం కారణంగా ఉపగ్రహ చిత్రాల ద్వారా తక్షణ నష్టం అంచనాలో కొన్ని పరిమితులు ఉన్నాయని వివరించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలు, అందుబాటులో ఉన్న సాంకేతిక సమాచారాన్ని సమన్వయం చేసుకుని నష్టాన్ని అంచనా వేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఈ కేంద్ర బృందానికి హైదరాబాద్‌కు చెందిన రేఖారాణి కొల్లు నాయకత్వం వహించారు . ఈ బృందంలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో, హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి.ఎస్.పి. శర్మ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ అలోక్ జవహర్, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాకేష్ కుమార్ సింగ్ , సూపరింటెండింగ్ ఇంజనీర్, కృష్ణా అండ్ కోఆర్డినేషన్ సర్కిల్, కేంద్ర జల సంఘం సభ్యులుగా ఉన్నారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, సహాయ కలెక్టర్ కె.ఆదిత్య శర్మ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎన్. మల్లికార్జున రావు, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.దుర్గేష్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు

## తుఫాను దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు




**పెన్ పవర్ -- ఉంగుటూరు । అక్టోబర్ 31**
నేలకొరిగిన వరి పంటలకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318 రకం సాగు చేయాలని సూచనఉంగుటూరు: ఆర్నబ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల బృందం, మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఉంగుటూరు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి వంగడాలు, తుఫాను సమయంలో వీచిన బలమైన గాలులకు పంట ఎంతమేరకు దెబ్బతిన్నది అనే అంశాలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వివిధ వరి రకాల పనితీరు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం, భవిష్యత్తులో రైతులు ఎలాంటి వంగడాలను సాగు చేయాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.తుఫాను ప్రభావానికి స్వర్ణ, సంపద స్వర్ణ, కావేరి స్వర్ణ తదితర రకాలు అధికంగా నేలకొరిగినట్లు గుర్తించారు. వీటికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318 రకాన్ని సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు.

# ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకోవాలి

**నవంబర్ 1న ప్రత్యేక ఓటింగ్ సదుపాయం**



**రంపచోడవరం, (పోలవరం బ్యూరో ) పెన్ పవర్ అక్టోబర్ 31:** పోలవరం జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ కోరారు.ఎన్నికల విధుల కారణంగా ఎవరూ ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఓటింగ్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో పేరు నమోదైన సంబంధిత మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటు వేయవచ్చని పేర్కొన్నారు.ఓటు వేసేందుకు ఎన్నికల విధుల కేటాయింపు ఉత్తర్వులు, ఓటరు గుర్తింపు కార్డు లేదా ఎన్నికల సంఘం ఆమోదించిన ఫొటో గుర్తింపు కార్డు, ఓటరు జాబితాలో పేరు, క్రమ సంఖ్య వివరాలు వెంట తీసుకురావాలని సూచించారు. అర్హత కలిగిన సిబ్బంది ఎన్నికల విధి ధ్రువీకరణ పత్రం (ఈడీసీ) లేదా నిబంధనల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి అర్హుడైన ఉద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 31:**భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఇతర పోలీసు అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడిగా, స్వతంత్ర భారతదేశ తొలి ఉప ప్రధానిగా, తొలి హోం మంత్రిగా దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, జాతీయ ఐక్యతకు బలమైన పునాదులు వేసి, అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆయన ఉక్కు మనిషిగా కీర్తించబడ్డారని తెలిపారు. ఆయన దృఢ సంకల్పం, ధైర్యం, పట్టుదల, నాయకత్వ పటిమ భారతదేశ సమైక్యతకు ప్రతీకగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రత, సమైక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచిస్తూ, పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచి రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాంబార్ జింకను వేటాడిన ఇద్దరు అరెస్ట్..15రోజులు రిమాండ్



**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.31** పాపికొండల జాతీయ పార్కు పరిధిలో సాంబార్ జింకను విల్లంబులతో వేటాడిన ఇద్దరు వ్యక్తులను అటవీశాఖ అధికారులు వెంటనే,పట్టుకొని,అదుపులోనికి తీసుకున్నారు.వారి నుంచి జింక కళేబరంతో పాటు వేటకు ఉపయోగించిన విల్లు,బాణాలను స్వాధీనం చేసుకున్నారు.అటవీశాఖ విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్టోబర్.29న వి.ఆర్.పురం మండలంలోని జీడిగుప్ప బీట్,దారపల్లి గ్రామ సమీపంలోని కొల్లేఅంతోగు వాగు ప్రాంతంలోఈ ఘటన చోటుచేసుకుంది.పాపికొండల జాతీయ పార్కు పరిధిలోని అటవీ ప్రాంతంలో సాంబార్ జింకను వేటాడుతుండగా బోడుగుంపు గ్రామానికి చెందిన కురా రాముడు,నాగేంద్రపురం గ్రామానికి చెందిన మడివి గోవింద్‌ను అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు.ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కేసు నమోదు చేశారు.చింతూరు అటవీ డివిజన్ అధికారి సంకేత్ సునీల్ గరుడ్ ఆదేశాల మేరకు వి.ఆర్.పురం అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్.రామకృష్ణ,డిప్యూటీ రేంజ్ అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, బీట్ అధికారి ఎస్.ఆదిలక్ష్మి తదితరులు ఈ చర్యలు చేపట్టారు.అనంతరం అక్టోబర్ 30న నిందితులను రంపచోడవరం ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం 15 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.దీంతో వారిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు.అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

## కూటమి అభ్యర్థుల విజయానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విస్తృత ప్రచారం

**లక్కొండతో పాటు ఐదు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం.. జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ఓట్ల అభ్యర్థన**







**గంగవరం, పెన్ పవర్ అక్టోబర్ 31:**స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఓటర్లను కోరారు. గంగవరం మండలంలో కూటమి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా శనివారం ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.గంగవరం మండలం లక్కొండ ఎంపీటీసీ కూటమి అభ్యర్థి సారపు పావని, జడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ తీగల ప్రభకు మద్దతుగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు. గంగవరం మండల టీడీపీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి నేతృత్వంలో లక్కొండతో పాటు చిన్న అడ్డపల్లి, పెద్ద అడ్డపల్లి, చీడిపాలెం, గార్లపాడు, పిడతమామిడి గ్రామాల్లో జడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ తీగల ప్రభ విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. పలు గ్రామాల్లో అభ్యర్థులకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోసూరి కాశి విశ్వనాథరెడ్డి, గంగవరం మండల టీడీపీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కనిగిరి సుభాష్, ఆముదాలబంధ ఎంపీటీసీ కూటమి అభ్యర్థి లోతా సత్యవతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఈక బుల్లికొండలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 31:**తూర్పుగోదావరి జిల్లా పోలీసు విభాగంలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పదవీ విరమణ పొందిన. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్స్పెక్టర్ జి.మహేష్ బాబు లను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖకు వారు అందించిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. విధి నిర్వహణలో వారు చూపిన అంకితభావం, క్రమశిక్షణ, సేవా స్ఫూర్తిని అభినందించారు. వారి భావి జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ, హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచి రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పి.సంజీవ్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నిడదవోలు, కొవ్వూరు, మండపేట మున్సిపాలిటీల్లో ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, అక్టోబర్ 31:**తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు, కొవ్వూరు, మండపేట మున్సిపాలిటీల్లో ఆదివారం నిర్వహించనున్న సాధారణ ఎన్నికలను స్వేచ్ఛాయుత, పారదర్శక, నిష్పక్షపాత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, మైక్రో అబ్జర్వర్ల నియామకం, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు సహా అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆమె వెల్లడించారు. పోలింగ్ విధులకు నియమితులైన సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు.

**ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్**

ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించు కోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఓటరు ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటును నమోదు చేయాలని పిలుపునిచ్చారు.

**ఓటరు గుర్తింపు కోసం ప్రత్యామ్నాయ పత్రాలకు అవకాశం**

పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లు తమ ఓటరు స్లిప్ తో పాటు ఎపిక్ కార్డు లేదా రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించిన ప్రత్యామ్నాయ ఫోటో గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, రేషన్ కార్డు వంటి గుర్తింపు పత్రాలను సమర్పించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వివరించారు. అయితే, ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాల విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, అనుమతించిన పత్రాల జాబితాను ఓటర్లు అనుసరించాలని సూచించారు.

**ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి**

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. నిడదవోలు, కొవ్వూరు, మండపేట మున్సిపాలిటీల పరిధిలోని ఓటర్లందరూ పోలింగ్ రోజున తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు.

## తుఫాను బాధితులకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకుల పంపిణీ



**పెన్ పవర్ -- ఉంగుటూరు । అక్టోబర్ 31**ఉంగుటూరు: ఆర్నబ్ తుఫాను ప్రభావంతో పునరావాస కేంద్రాలకు తరలివచ్చిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు ఉంగుటూరు తహశీల్దార్ ఎం. సన్యాసిరావు వెల్లడించారు.శుక్రవారం రాత్రి, శనివారం ఆయా గ్రామాల్లోని వీఆర్వోల ద్వారా చేబ్రోలు, అక్కుపల్లి గోకవరం, తిమ్మయ్యపాలెం, కాగుపాడు, వెల్లమిల్లి, నీలాద్రిపురం గ్రామాల్లో మొత్తం 79 కుటుంబాలకు బియ్యం, పంచదార, పప్పు, వంటనూనె, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు తదితర నిత్యావసర సరుకులను అందజేసినట్లు తెలిపారు.అలాగే కుటుంబంలో ఒకరు ఉన్న వారికి రూ.1,000, ఇద్దరు సభ్యులున్న కుటుంబానికి రూ.2,000, ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులున్న కుటుంబానికి రూ.3,000 చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఈ విధంగా మొత్తం 79 కుటుంబాలకు రూ.1,68,000 నగదును ప్రభుత్వం తరఫున పంపిణీ చేసినట్లు తహశీల్దార్ వివరించారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com